# విద్యార్థి జ్వాల

Rs. 12/- per copy

Vol. 30 - No.6

April 2024



## దేశంలో ఎన్నికలు

# దేవుని రాజ్యమే మన లక్ష్యం

2018 జనవరిలో జరిగిన 'స్టే అండ్ సౌండ్ ద గాస్పల్' కార్యక్రమంలో భాగంగా ఒక పల్లెటూరుకు వెళ్ళాము. అక్కడ ఒక పెద్ద సంఘంలో రాజకీయ పార్టీలను బట్టి వేర్వేరు సమయాల్లో ఆరాధనలు జరగడం చూసి ఆశ్చర్యపోయాను. గతంలో కులం, వర్గాలను బట్టి సంఘాలు విడిపోయి వేర్వేరుగా ఆరాధనలు జరిగేవి, ఇప్పుడు రాజకీయ పార్టీలను బట్టి జరుగుతున్నాయి. రాజకీయాలు సంఘాల్లోకి, విశ్వాసుల జీవితాల్లోకి చొచ్చుకొచ్చాయి. జీవము గలిగిన దేవుని సంఘంలో, జీవంలేని/ఆత్మీయంగా చచ్చిన వారు, ఆత్మీయ పరిపక్వత లేనివారు స్థానాలను అలంకరిస్తూ, అడ్డ దారులు తొక్కుతూ, దేవుని రాజ్యాన్ని కట్టడానికి బదులు రాజకీయ నాయకులవలె తమ స్వంత రాజ్యాల్ని కట్టుకొంటున్నారు.

ప్రతి సంఘం, విశ్వాసి యొక్క లక్ష్యం, పని, ప్రయాస 'దేవుని రాజ్య నిర్మాణం' కోసమై ఉండాలి. యేసుక్రీస్తు తన రాజ్యం ఈ లోక సంబంధమైనది కాదని, అది ఆత్మీయమైన విలువలతో కూడినదని చెప్పి అలాగే జీవించాడు. "కాలము సంపూర్ణమైయున్నది, దేవునిరాజ్యము సమీపించియున్నది, మారుమనస్సు పొంది సువార్త నమ్ముడని చెప్పుచు దేవుని సువార్త ప్రకటించాడు" (మార్కు1:15). "మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడని" కొండమీద ప్రసంగంలో చెప్పాడు (మత్తయి 6:33). దేవుని రాజ్యము భోజనమును పానమును కాదు గాని, నీతియు సమాధానమును పరిశుద్ధాత్మయందలి ఆనందమునైయున్నది (రోమా14:17) అని అపొస్తలుడైన పౌలు చెబుతాడు.

'ఎక్లీషియా' అన్న గ్రీకు పదానికి సంఘము అనే పదాన్ని తెలుగు బైబిల్ తర్జుమాలో వాడారు. 'ఎక్లీషియా' అన్న పదం చరిత్రలో కేవలం యేసు మాత్రమే వాడలేదు. ఆయన కంటే ముందు గ్రీకులు తమ జ్ఞానాన్ని, తత్వ శాస్త్రాన్ని పలుదేశాలకు చేరవేయడానికి, వారి ప్రభావాన్ని ఇతర దేశాలపై చూపడానికి, వారు చెరపట్టిన రాజ్యాలలోనికి "ఎక్లీషియా" అనే ఒక స్వతంత్ర లేక స్వచ్ఛంద మానవ గుంపును పంపేవారు. వారు జీత భత్యాలకు కాక గ్రీకు తత్వానికి, వారి సాంస్కృతిక, సామాజిక జీవన విధానాలకు కట్టుబడిన అంకిత భావం గలవారై వెళ్ళిన ప్రతి చోటా గ్రీకు సంస్కృతి, తత్వాన్ని నూరి పోసేవారు. తర్వాత రోమీయులు గ్రీకులను ఓడించి రాజ్యం పొంది వారు కూడా "ఎక్లీషియా" అనే సమాజాన్ని వారి కైసరు మహిమ, యుద్ధ పటిమ, భవన నిర్మాణ సాంకేతికత, ధరించే బట్టలు, వైభవం మొదలైన వాటిని చెరపట్టిన రాజ్యాలలో విస్తృతం చేయడానికి ఉపయోగించారు. ఈ నేపథ్యంలో యేసు తన శిష్యులను 'ఎక్లీషియా' అని పిలిచాడు. అప్పటికే ఆయన పుట్టి పెరిగిన సంస్కృతిలో 'సినగోగు' లేక 'సమాజ మందిరం 'అనే సంస్కృతి ఉంది.

యేసు మతానికే ప్రాధాన్యత ఇస్తే ఆయన ఇంకో సినగోగు స్థాపించేవాడు కానీ యేసుకున్న ప్రధాన లక్ష్యం ఆయన రాజ్యం గనుక ఆ రాజ్య స్థాపనకు అనువైన పద్ధతి అయిన 'ఎక్లీషియా' అనే సమాజాన్ని ఎన్నుకొన్నాడు. "ఎక్లీషియాగా" పిలిచిన తన శిష్యగణం ప్రపంచాన్ని 'యేసే' 'క్రీస్తు' లేక 'రాజు/ప్రభువు' అనే భావజాలంతో లేక సువార్తతో తల క్రిందులు చేయసాగారు. 'దేవునిరాజ్యాన్ని' భారతదేశంలో విస్తరింప జేయడానికి తమ సొంత ఇల్లు, దేశాలు, కుటుంబాలు, సంస్కృతిని త్యజించి 'దేవుని రాజ్య స్థాపన' అనే పనికి మిషనరీలు, అనేకమంది దైవసేవకులు పూనుకొన్నారు.

క్రైస్తవ సంఘ ప్రధాన లక్ష్యం రాజకీయాలు చేయడం, తమ స్వంత రాజ్యాల్ని కట్టుకోవడం, చచ్చిపోయి పరలోకం పోవడం కాదు కానీ బ్రతికుండగానే దేవుని రాజ్యాన్ని నిర్మించడం. మానవ జీవన ప్రతిరంగంలో యేసు క్రీస్తు ప్రభుత్వాన్ని ఆయన వాక్య విలువల ద్వారా నిర్మించడం. కాబట్టి మీరీలాగు ప్రార్థన చేయుడి – పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక, నీ రాజ్యము వచ్చుగాక, నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక (మత్తయి 6:9-10).

దేవుని చిత్తం కేవలం క్రైస్తవ సంఘాలకి, క్రైస్తవుల ఇళ్ళకు పరిమితం చేసేవారు అక్కడితోనే ఆగిపోతారు. దేవుడు అందరికీ తండ్రియని, ఆయన చిత్తం పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమిమీద అన్ని రంగాల్లో, అన్ని కుటుంబాల్లో అన్ని సమాజాల్లో, అన్ని ప్రభుత్వాలలో నెరవేరాలన్నది ఆయన ఆశ. ఆ దిశగా ఆలోచిస్తూ, ప్రణాళికతో కూడిన కార్యాచరణ చేయడం యేసుప్రభువు రక్తంచే కొనబడిన విశ్వాసుల, నాయకుల కర్తవ్యం. ఇలాంటి రాజ్యస్థాపన, విస్తరణ కేవలం ఆత్మీయమైన వారికే సాధ్యం.

– పి. సునీల్ జాకబ్

# విద్యార్థి జ్వాల



Vol. 30, No. 6 April 2024
UESI Publication Trust -
Andhra Pradesh Branch

EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.

CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI Publication Trust -AP Branch
C/o. UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
STUDENTS (1 Year) - Rs. 150
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (1 Year) - Rs.300
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years) Rs. 2000/-
OVERSEAS (10 Years) - Rs. 2000/-

VIDYARTHI JWALA ACCOUNT NO:

**Account Name: UESI-AP-VIDYARTHI JWALA**

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**Account Name: UNION OF EVANGELICAL STUDENTS**

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**Account Name: UESI-AP-PUBLICATION TRUST**

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

May: Influential Leadership
June: Planning
July: Social Evils
August: Minority - Majority
September: Core Values

**Note:** Please send your writeups on or before
**10th of every month**

## ప్రజాస్వామ్యం - పరిరక్షణ



భారత ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. 2024 ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు దేశ వ్యాప్తంగా మొత్తం ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. అంటే భారతదేశంలో 2024 ఎన్నికలు 44 రోజులు జరుగుతాయి. భారతదేశంలో మొదటి మూడు సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగాయని, 1967లో జరిగిన నాల్గవ సార్వత్రిక ఎన్నికల సమయం నుండి ప్రమాణాల పతనం ప్రారంభమై క్రమక్రమంగా ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టి వేసిందని విశ్లేషకుల అభిప్రాయం.

ప్రజాస్వామ్యంలో ప్రజల స్వాతంత్ర్యం, సమానత్వం, న్యాయాలకు హామీ ఉంటుంది. దీనికి అనుగుణంగా ఎన్నికల్లో అర్హులైన నాయకులను ఎన్నుకోకపోయినా, ఎన్నికైనవారు దీనికి భిన్నంగా ప్రవర్తించినా ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నట్లే.

“ఎవరో మెరుపు దాడి చేసి ప్రజాస్వామ్యాన్ని హతమార్చే అవకాశం ఎంతమాత్రం లేదు, ప్రజల/నాయకుల నిర్లక్ష్యం, ఉదాసీనత, అనాసక్తి వల్ల క్రమేపీ దానికదే అంతరిస్తుంది” అని చికాగో యూనివర్శిటీ ప్రెసిడెంట్, ఛాన్సలర్‌గా పనిచేసిన రాబర్ట్ ఎం హచిన్స్ అంటాడు. ప్రజాస్వామ్యం, దాని పరిరక్షణ కోసం క్రైస్తవులుగా పట్టుదలతో ప్రార్థిద్దాం, వివేచనతో మంచి చేసే వారికి ఓటువేద్దాం, సత్యాన్ని అనుసరించి నడుచుకొందాం, లోకానికి ప్రభువును, ఆయన ప్రేమను చూపిద్దాం.

## లోపలి పేజీల్లో...

- దేవుని రాజ్యమే మన లక్ష్యం - 2
- ప్రజాస్వామ్యం - పరిరక్షణ - 3
- శ్రమలు స్వప్నసాధనాలు - 4
- భారత దేశం బంగారు దేశంగా మారాలంటే ?- 5
- ఓటెందుకు వేయాలి? - 9
- దేవుని సంఘం రాజకీయాలు - 12
- దేవుడు - 15
- పర్‌పెచ్‌వా - ఫెలిసిటాస్ - 19
- దేశంలో ఎన్నికల కోసం ప్రార్థిద్దాం - 21
- మెటీరియలిజం - 22
- రాజు ఎలా ఉండాలి? - 24
- క్రీస్తును ఒంటరిగా వెంబడించలేను - 25
- ఆత్మ విమర్శ - 27
- గెలుపే ముఖ్యమా? - 28
- చింతించడం - 31
- నేనే - 32

# శ్రమలు – స్వప్న సాధనాలు

సర్వోన్నతుని స్వప్నం సామాన్యులమైన మనమే. మన జీవితాలను సస్యశ్యామలం చేసేందుకు సార్వభౌముడు ఎన్నుకొన్న మార్గం అసాధారణమైనది, అంద విహీనమైనది, అందరూ ఆమోదించనిది. మన శ్రేష్టులం కాకపోయినా మన ఎన్నిక అన్నివేళలా శ్రేష్టంగా ఉండాలను కొంటాము. ఆయన శ్రేష్టుడైయుండి సామాన్యుల్ని ఎన్నుకోవడం ఆయన మహోన్నతమైన మనస్సుకు, మమకారానికి నిదర్శనం. అయితే, ఆయన అనుకున్నది సాధించడానికి కేవలం ఎంపికతో సరిపెట్టలేదు. తన సర్వస్వాన్ని ధారపోయాల్సి వచ్చింది. అందులో భాగంగా శ్రమల ను సాధనాలుగా పరిగణించాల్సి వచ్చింది. తన స్వప్నం నెరవేరేందుకు శ్రమలు తప్పనిసరి అని తెలిసికూడా సదుద్దేశంతో, సత్‌సంకల్పంతో, సాహసంతో ముందుకెళ్ళాడు.

'ఆయన తన యెదుట ఉంచబడిన ఆనందం కొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టాడు' అని



హెబ్రీ గ్రంథకర్త రాస్తున్నప్పుడు ఆయన ఆనందం ఎవరు? ఆయనకు ఆనందం ఎలా వస్తుంది? మనల్ని రక్షించడమే ఆయన ఆనందం (తండ్రి చిత్తం నెరవేర్చడమే ఆయన ఆనందం). అనంతమైన ఆనందం సంపాదించేందుకు కొద్ది కాలపు శ్రమలను, అవమానాన్ని తను కోరుకొన్నాడు, కౌగలించుకొన్నాడు. సమస్యలను, శ్రమలను అవమానాన్ని కోరుకోవడమే కాకుండా చివరికి తన ప్రాణాన్ని ఫణంగా పెట్టాడు. అందుకే మనం ఈస్టర్ సంబరాలు జరుపుకున్నాం. ఈస్టర్‌ను మనం ఆనందించాలంటే ప్రపంచం గుడ్‌ఫ్రైడే చూడాల్సిందే.

సర్వోన్నతుడే తన స్వప్నం నెరవేర్పు కొరకు శ్రమల్ని సాధనాలుగా చేసుకొంటే ఆయనను వెంబడించేవారంగా, ఆయన బిడ్డలుగా మనం కూడా ఆ బాటనే పయనించాలి. ప్రయాణం సుఖమయం కాకపోవచ్చు, కానీ గమ్యం శ్రేష్టమైనది, మధురమైనది.

'ప్రతి ఒక్కరూ చనిపోయిన తర్వాత స్వర్గాన్ని ఆస్వాధించాలనుకొంటారు, కానీ వారు జీవించి ఉన్నప్పుడు పరలోకపు మనస్సు కలిగి ఉండడానికి ఇష్టపడరు" అని డియల్ మూడి చెప్పి మాట ఎంత వాస్తవమో! పరలోకపు మనస్సు కలిగి ఉండే ప్రక్రియలో శ్రమలను మనం ఆహ్వానించకపోయినా అవి మనల్ని చేరినప్పుడు ఆనందంగా అంగీకరించాలి. సర్వోన్నతుని స్వప్నం మన శ్రేయస్సే అయితే, ఆయన సారూప్యములోనికి మారడం మనకూ స్వప్నం కావాలి. క్రీస్తు యేసునకు కలిగిన మనస్సు మనం కూడా కలిగి ఉండాలి. అందులో భాగంగా ఆయన స్వప్నం నెరవేర్చేందుకు శ్రమలను సాధనాలుగా మనమూ సదుద్దేశంతో స్వీకరించాలి.

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్
యుఇయస్ఐ–ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు





# భారత దేశం బంగారు దేశంగా మారాలంటే?

## ఎన్నికలలో క్రైస్తవ దృక్పథం

ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం మన భారత దేశం. మన రాజ్యాంగం భారత దేశాన్ని స్వతంత్రమైన, సార్వభౌమాధికారం కలిగిన గణతంత్ర దేశంగా అభివర్ణిస్తుంది. అది దేశంలోని పౌరులందరికీ న్యాయ, సామాజిక, ఆర్థిక పరంగా సమానత్వం ఇస్తుంది. ప్రజలకు భావ ప్రకటనతో పాటు తమకు నచ్చిన విశ్వాసాన్ని అనుసరించడానికి స్వేచ్ఛ నిచ్చింది. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంలను లక్ష్యాలుగా కలిగి దేశం పని చేయాలని ఉద్దేశించింది. అయితే ఈ నాలుగు విషయాలు మన ఉనికికే పునాదిగా డా. బి.ఆర్. అంబేద్కర్ అభివర్ణిస్తారు.

### దేశంలో ప్రస్తుత పరిణామాలు

నేడు మన దేశం స్వాతంత్ర్యం సాధించి 77 సంవత్సరాలు దాటింది. వివిధ రంగాలలో అది సాధించిన అభి వృద్ధి, విజయాలు గణనీయం. అయితే నేడు దేశం కొత్త సవాళ్ళు ఎదుర్కొంటుంది. దేశంలో పలు ప్రాంతాలలో పెరుగుతున్న ప్రాంతీయ, భాష, కుల, మతపరమైన వివక్షలు ఆందోళనను కలిగిస్తున్నాయి. ఛండీఘడ్ నగరపాలక ఎన్నికల ప్రక్రియను విచారించిన అత్యున్నత న్యాయస్థానం 'ప్రజాస్వామ్యం హత్య చేయబడిందని' తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. ప్రజాస్వామ్యమంటే కేవలం ప్రజలు ఎన్నికలలో పాల్గొనే ప్రక్రియ మాత్రమే కాదు అది ఎన్నికలు జరిగే తీరుతెన్నులు కూడా. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా జరగాలి. ఈ ఎన్నికల ప్రక్రియను నిర్వహించే ఎన్నికల సంఘ సభ్యుల ఎంపిక మొదలు దాని నిర్వహణ స్వయం ప్రతిపత్తి కలిగి ఉండాలి. అది రాజ్యాంగ స్ఫూర్తికి తగినట్లుగా హుందాగా ఎట్టి ఒత్తిళ్ళకు తలొగ్గకుండా వ్యవహరించాలి. కానీ నేడు ఎన్నికల సంఘ సభ్యుల ఎంపికలో చట్టపరమైన మార్పులు తీసుకురావడం మంచి పరిణామం కాదు. ఇటీవల కాలంలో ఎన్నికల సంఘం తానే నిర్ణయించిన పరిమితులకంటే ఎన్నికలలో నిలబడిన అభ్యర్థులు ఎన్నో రెట్లు ఎక్కువ



'మనిషి చేసిన క్రియలకు మనిషి బాధ్యుడు' అనే లక్షణంతో దేవుడు మనిషిని సృజించాడు. కానీ మనిషికి మాత్రం తన క్రియలకు బాధ్యత తీసుకోవడం ఇష్టం ఉండదు. ఆ బాధ్యతను దేవునిపైనో, ఇంకొక మనిషిపైనో, పరిస్థితుల పైనో వేయడానికి ప్రయత్నిస్తాడు. ప్రభుత్వాలను పాలకులను వారి మంచి చెడులను బేరీజు వేసుకొని తమ స్వేచ్ఛను బాధ్యతాయుతంగా ఉపయోగించి ఎన్నుకోవడం ద్వారా మన సమాజంలో నీతి న్యాయాలకు కారకులమవుతాము. సరైన పాలకులు లేదా ప్రభుత్వాలు లేవు అంటే దానికి పలు కారణాలు వెదకడం కంటే ముందు మనల్ని మనం పరిశీలించుకోవాలి.




ఖర్చు చేయడం గమనించినా, ఫిర్యాదులు అందినా దాని ఉదాసీన వైఖరి విచారకరం. పైగా ఎన్నికలలో ఉపయోగించే ఈవియం యంత్రాలను గతంలో అస్సాం పూణేలలో కొందరు చోరీ చేయడం ఆందోళన కలిగించే విషయాలు. అసమ్మతి గళాలను నొక్కి పట్టడానికి యథేచ్ఛగా నిఘా సంస్థలను ఉసిగొల్పడం, వ్యాపారవేత్తలనుండి ఎలక్టోరల్ బాండ్లు రూపంలో సొమ్ము సేకరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటికలే. ప్రజాస్వామ్యానికి నాలుగో పునాదిగా మీడియా ఉండాలి. కానీ నేడు మన దేశంలో దాదాపు అన్ని మీడియా సంస్థలు, పత్రికా యాజమాన్యాలు కొన్ని బడా వ్యాపారవేత్తల చెప్పుచేతలలోకి వెళ్ళిపోయాయి. ఏవో కొన్ని స్వతంత్ర యూట్యూబ్ ఛానల్స్ తప్పించి ప్రజలకు నిజాలు తెలిసే అవకాశాలు దాదాపుగా శూన్యమయ్యాయి. ఒక దేశం, ఒక పార్టీ వంటి భావజాలం చాపకింద నీరులాగా మెల్లమెల్లగా ప్రవహిస్తుంది.

ఈ నేపథ్యంలో ఒక క్రైస్తవ గళం లేదా కలం జల్లెడపట్టినా కనబడకపోవడం అత్యంత శోచనీయం. సమకాలీన రాజకీయాలపట్ల క్రైస్తవులు అవగాహన కలిగియుండాలి. అంతేకాదు తాము పోషించాల్సిన పాత్ర పట్ల స్పష్టత కలిగియుండటం అవసరం. భారత దేశ పౌరులముగా ఈ దేశ శ్రేయస్సును కాంక్షించాలి. అయితే దేవుడు తన బిడ్డలు ఈ లోకంలో వెలుగులాగా ఉప్పులాగా జీవించాలని ఆజ్ఞాపించినప్పుడు దానికనుగుణంగా మన నడవడి ఎలా ఉండాలి?

## దేవుని సార్వభౌమాధికారం

మొదటగా, ఇహలోక అధికారాలను, ప్రభుత్వాలను, వాటి మూలాలను, స్వరూప స్వభావాలను అర్థం చేసుకోవాలంటే దేవుని సార్వభౌమాధికారం అనే అంశం పరిశీలించాలి. దేవుని వలన కలిగినది తప్ప మరి ఏ అధికారమును లేదు; ఉన్న అధికారములు దేవుని వలననే నియమింపబడియున్నవి (రోమా 13:1); 'ఆయన కాలములను సమయములను మార్చువాడైయుండి, రాజులను త్రోసివేయుచు.... నియమించుచున్నవాడునై యున్నాడు. (దానియేలు 2:21); యెహోవా ఆకాశమందు తన సింహాసనమును స్థిరపరచియున్నాడు. ఆయన అన్నిటి మీద రాజ్య పరిపాలన చేయుచున్నాడు (కీర్తన 103:19) సర్వోన్నతుడగు దేవుడు మానవుల రాజ్యముపైన అధికారియైయుండి, తానెవనికి దాని అనుగ్రహింప నిశ్చయించునో వానికి అనుగ్రహించునని నీవు తెలిసికొనువరకు .. ఆయన పరలోక సేన యెడలను భూనివాసుల యెడలను తనచిత్తముచొప్పున జరిగించువాడు; ఆయన చేయి పట్టుకొని నీవేమి చేయుచున్నావని ఆయనతో చెప్పుటకు ఎవడును సమర్థుడుకాదు(దానియేలు 4:32-35) అనే లేఖనాలు గమనించాలి. ఒక దేశంలో లేదా రాష్ట్రంలో లేదా అది యే వ్యవస్థలోనైనా దేవుని అనుమతి లేనిదే ఒకనికి అధికారం దక్కదు. లేఖనాలను పరిశీలిస్తే ఈ సత్యం తేటతెల్లం అవుతుంది. ఆయన నిర్ణయం మేరకు అధికారం అనుగ్రహింపబడుతుంది. ఆ నిర్ణయాలను ఎవరూ ప్రశ్నించలేరు అనే సత్యం ఆయన సార్వభౌమాధికారాన్ని సూచిస్తుంది.

## మానవ స్వేచ్ఛ, బాధ్యత?

అయితే ఇప్పుడొక ప్రశ్న ఉత్పన్నమవుతుంది. రాజులు లేదా పాలకులను దేవుడు నిర్ణయించినప్పుడు మానవుని పాత్ర ఏంటి? మానవులు స్వేచ్ఛగా ఎంపిక చేసుకొనే ఎన్నికల ప్రక్రియని ఎలా అర్థం చేసుకోవాలి? దేవుని సార్వభౌమ అధికారిక పరిధిలో మానవుని స్వేచ్ఛ ఉనికిలోకి వస్తుంది. మంచి చెడుల

ను ఎంచుకొనే స్వేచ్ఛను తన పోలికలో సృజించబడిన మానవునికిచ్చాడని బైబిల్ చాలా స్పష్టంగా వివరిస్తుంది. ఎంపిక అవకాశం ఉన్నప్పుడే స్వేచ్ఛ అనేది నిజమవుతుంది. కాబట్టి దేవుడు ఏర్పరచిన నీతినియమాల పరిధిలో మానవుడు చేసే ఎన్నిక చాలా ముఖ్యమైనది. మానవ స్వేచ్ఛ పరిమితులు లేనిది, షరతులు లేనిది కాదు. దేవుడు నిర్దేశించిన హద్దులలో మానవ స్వేచ్ఛ ఉనికిలోకి వస్తుంది. మనిషి తన స్వేచ్ఛని వినియోగించి ఎంపిక చేసుకొన్నప్పుడు దానికి బాధ్యత వహించడంతో పాటు ఆ ఎంపిక పర్యావసానాలను అనుభవించాల్సి ఉంటుంది. ఈ విషయాలు లేఖనాలను పరిశీలిస్తే స్పష్టం అవుతుంది. 'మనిషి చేసిన క్రియలకు మనిషి బాధ్యుడు' అనే దైవ నియమాన్ని మరచిపోకూడదు. దేవుడు గట్టిదనం అనే స్వభావంతో రాళ్ళను సృజించాడు, తడి చేయగల స్వభావంతో నీటిని సృజించాడు, ఎదగడం, పుష్పించడం, ఫలించడం అనే స్వభావంతో మొక్కలను సృజించాడు. అలాగే 'మనిషి చేసిన క్రియలకు మనిషి బాధ్యుడు' అనే లక్షణంతో దేవుడు మనిషిని సృజించాడు. కానీ మనిషికి మాత్రం తన క్రియలకు బాధ్యత తీసుకోవడం ఇష్టం ఉండదు. ఆ బాధ్యతను దేవునిపైనో, ఇంకొక మనిషిపైనో, పరిస్థితుల పైనో వేయడానికి ప్రయత్నిస్తాడు. ఉదా: ఆదాము (దేవుడిపై బాధ్యతను నెట్టివేసే ప్రయత్నం- నా అవిధేయతకు నువ్వు ఇచ్చిన ఈ స్త్రీ కారణం అంటాడు). ప్రభుత్వాలను, పాలకులను వారి మంచి చెడులను బేరీజు వేసుకొని తమ స్వేచ్ఛను బాధ్యతాయుతంగా ఉపయోగించి ఎన్నుకోవడం ద్వారా మన సమాజంలో నీతి న్యాయాలకు కారకులమవుతాము. సరైన పాలకులు లేదా ప్రభుత్వాలు లేవు అంటే దానికి పలు కారణాలు వెదకడం కంటే ముందు మనల్ని మనం పరిశీలించుకోవాలి. పరలోకమందు దేవుని చిత్తం జరుగుచున్నట్లు ఈ లోకంలో కూడా ఆయన చిత్తం జరగాలంటే మనం చేయాల్సిన పనులు ఎన్నో ఉన్నాయి. దేవుని సార్వభౌమ క్రియలు, మానవ స్వేచ్ఛ సంయుక్తంగా అమలు అయ్యేవిధం పరిమిత జ్ఞానం కలిగిన మనిషి పరిపూర్ణంగా గ్రహించలేక పోయినా అతని అవగాహన మేరకు దానిని గ్రహించడానికి వీలుగా లేఖనాలలో వివరించబడింది.

## దేశ శ్రేయస్సు కోసం ప్రార్థన

మనిషి తన స్వేచ్ఛను అధికార ఎంపిక ప్రక్రియలో ఏ విధంగా వాడుకోవాలని లేఖనాలు సూచిస్తున్నాయో పరిశీలిద్దాం. సమాజం లేదా దేశం పట్ల బాధ్యత, దేశభక్తి కలిగిన ఒక క్రైస్తవుడు ఒక ప్రత్యేకమైన ప్రార్థనా జీవితం కలిగి ఉంటాడు. ఉదాహరణకు అబ్రహాము, మోషే, ఎస్తేరు, దానియేలు, నెహెమ్యా లాంటి ఎంతోమంది వారి వారి సమకాలీన సమాజాన్ని ఎంతో ప్రభావితం చేశారు అంటే వారి ప్రార్థనాంశాలను పరిశీలించండి. మనము సంపూర్ణ భక్తియు మాన్యతయు కలిగి, నెమ్మదిగాను సుఖముగాను బ్రతుకు నిమిత్తము, అన్నిటికంటె ముఖ్యముగా మనుష్యులందరి కొరకును, రాజుల కొరకును, అధికారులందరి కొరకును విజ్ఞాపనములును ప్రార్థనలును యాచనలును కృతజ్ఞతాస్తుతులును చేయవలెనని హెచ్చరించుచున్నాను (1 తిమోతి 2:1-2). నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక (మత్తయి 6:10). నా పేరు పెట్టబడిన నా జనులు తమ్ము తాము తగ్గించుకొని ప్రార్థనచేసి నన్నువెదకి తమ చెడుమార్గముల ను విడిచినయెడల, ఆకాశము నుండి నేను వారి ప్రార్థనను విని, వారి పాపమును క్షమించి, వారి దేశమును స్వస్థపరచుదును.(2 దినవృత్తాంతములు 7:14). నేను మిమ్మును చెరగొనిపోయిన పట్టణము యొక్క క్షేమముకోరి దాని కొరకు యెహోవాను ప్రార్థనచేయుడి, దాని క్షేమము మీ క్షేమమునకు కారణమగును (యిర్మీయా 29:7). ఈ ప్రార్థనల నేపథ్యాన్ని, ప్రార్థనాంశాలను తదుపరి పర్యావసానాల



క్రైస్తవ ఓటరు ఎవరిని ఎంపిక చేసుకోవాలి? ఎంపిక చేసేటప్పుడు వ్యక్తి ఎలాంటి వాడు అన్న దానిపై ధ్యాస ఉంచాలి. నేటి రాజకీయాలలో నీతిమంతులు, పరిపూర్ణులు ఎవరూ కనబడరు. పోటీలోవున్న అభ్యర్థులలో ఎవరూ మెరుగైనవారో, సమాజానికి మేలు చేసే వారెవరో వాస్తవిక దృష్టితో వివేచించి ఎంపిక చేసుకోవాలి. ఎంపికలో పక్షపాత ధోరణులు అంటే సదరు వ్యక్తి నా సామాజిక వర్గం అనే ఆలోచనా సరళి ఉండకూడదు.



40 కోట్ల పైగా జనాభాతో; 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలు, 723 జిల్లాలు, 6,40,867 గ్రామాలు, 2700 జాతుల ప్రజలు, హిందీ ఇంగ్లీష్‌తో పాటు 23 అధికారిక భాషలు, 1700 ఇతర భాషలు, 543 + 2 యంపి సీట్లు (410 ఓ సి + 85 ఎస్ సి + 48 ఎస్ టీ + 2 ఆంగ్లో ఇండియన్) కలిగిన ప్రపంచంలో కెల్లా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం.

ను గమనిస్తే ఒక క్రైస్తవుడిగా దేశ శ్రేయస్సుకోసం, సరియైన పాలకులకోసం అతని ప్రార్థన ఎంత ప్రభావం చూపుతుందో గమనించగలరు.

## క్రైస్తవుని బాధ్యత

ప్రార్థన తర్వాత క్రియాత్మకంగా క్రైస్తవుడు కదలాలి. ఓటు వేయడం అనేది కేవలం ప్రాథమిక హక్కును వినియోగిం చుకోవటం మాత్రమే కాదని గుర్తు చేసుకోవాలి. ఆ ఓటును ఒక క్రైస్తవుడు బాధ్యతాయుతంగా వినియోగించినప్పుడు అది దేవుని ప్రణాళికలను అమలు చేస్తుందని గుర్తించడం ప్రాముఖ్యం. ఓటు వ్యక్తి అంతర్వాణి, అది అతని నమ్మకాలను, అతని విలువలను తెలియచేస్తుంది.

క్రైస్తవ ఓటరు ఎవరిని ఎంపిక చేసుకోవాలి? ఎంపిక చేసేటప్పుడు వ్యక్తి ఎలాంటి వాడు అన్న దానిపై ధ్యాస ఉంచాలి. నేటి రాజకీయాలలో నీతిమంతులు, పరిపూర్ణులు ఎవరూ కనపడరు. పోటీలోవున్న అభ్యర్థులలో ఎవరు మెరుగైనవారో, సమాజానికి మేలు చేసే వారెవరో వాస్తవిక దృష్టితో వివేచించి ఎంపిక చేసుకోవాలి. ఎంపికలో పక్షపాత ధోరణులు అంటే సదరు వ్యక్తి నా సామాజిక వర్గం వంటి ఆలోచనా సరళి ఉండకూడదు.

ఎంపిక చేసేటప్పుడు ఆ ఎంపిక సిద్ధాంత ప్రాతిపదిక మీద చేయడం శ్రేయస్కరం. నేడు సమాజంలో వివక్షతో కూడిన విద్వేషపూరిత భావజాలం ఎక్కువగా ప్రబలుతున్నప్పుడు, సమానత్వాన్ని గౌరవించుతూ అన్ని రకాల వివక్షలను వ్యతిరేకించే వారిని ఎంపిక చేసుకోవడం మంచిది. భిన్నత్వంలో ఏకత్వం మన భారత దేశ ఐక్యతకు, బలానికి పునాది. అట్టి సిద్ధాంతాన్ని నోటితో కాకుండా చేతలలో చూపించే నిఖార్సైన వారిని గుర్తించి ఎంపిక చేసుకోవాలి. భారత దేశంలో ధనిక పేద తారతమ్యాలను తగ్గించే పాలకులను ఆదరించాలి. ఏ అజెండా లేకుండా, సిద్ధాంతాలు లేకుండా, కేవలం డబ్బు సంపాదన, అధికారం కోసం వచ్చే పార్టీలు, వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. మంచి ఉద్దేశ్యం, అవినీతి రహిత పాలన అందించాలని, న్యాయ పరిపాలన అందించాలని తాపత్రయపడే సమర్థవంతమైన నాయకులను గుర్తించాలి.


## ప్రపంచంలో కెల్లా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం

భారతదేశం పేరు బైబిల్‌లో రాయడం, యేసుక్రీస్తు శిష్యుడైన తోమా ఈ దేశానికి వచ్చి సువార్త అందించడం గమనించినప్పుడు భారత దేశ క్రైస్తవునిగా ఎంతో అతిశయించవలసిన సంగతి. 140 కోట్ల పైగా జనాభాతో; 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలు, 723 జిల్లాలు, 6,40,867 గ్రామాలు, 2700 జాతుల ప్రజలు, హిందీ ఇంగ్లీష్‌తో పాటు 23 అధికారిక భాషలు, 1700 ఇతర భాషలు, 543 + 2 యంపి సీట్లు (410 ఓ సి + 85 ఎస్ సి + 48 ఎస్ టీ + 2 ఆంగ్లో ఇండియన్) కలిగిన ప్రపంచంలో కెల్లా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం.

## భారత దేశం బంగారు దేశంగా మారాలంటే?

ఇంతటి అద్భుతమైన దేశంలో పౌరునిగా ఒక క్రైస్తవునిగా మన బాధ్యత ఏంటి? ఆర్థిక, సామాజిక, నైతిక రుగ్మతలతో సతమతమవుతున్న సమాజానికి సమర్థవంతమైన, నీతియుక్తమైన పాలకులు రావాలంటే దేశం కొరకు ప్రార్థించే క్రైస్తవులు లేవాలి. రాజకీయ చైతన్యం కలిగిన క్రైస్తవ నాయకులు రావాలి. ఎన్నికల ప్రక్రియలో క్రియాశీలకంగా దైవనియమాలకు అనుగుణంగా ఓటుని వినియోగించుకొనే విశ్వాసులు ముందుకు రావాలి. లేఖనాల వెలుగులో దేశ శ్రేయస్సు కోసం ఒకరినొకరు ప్రోత్సహించుకొంటూ ముందుకెళ్తే భారత దేశం బంగారు దేశంగా మారుతుంది.

– వి. యస్. ఇవాన్స్, హైదరాబాద్



ప్రత్యేకం

# ఓటెందుకు వేయాలి?

ఉదయం 6 గంటలు! సోలమన్ ఇంట్లో కాలింగ్ బెల్ మోగింది. ఇంత ఉదయాన్నే ఎవరొచ్చారబ్బా అని అనుకొంటూనే తలుపు తీయడానికి వెళ్ళాడు సోలమన్. తలుపు తెరిచి చూస్తే జానీ అనే ఇయు విద్యార్థి. చేతిలో స్వీట్ బాక్స్ పట్టుకుని నిలబడి ఉన్నాడు. 'ప్రైజ్ ది లార్డ్ అన్నా' అంటూ స్వీట్ బాక్స్ తెరిచి ముందుకు చాపాడు. 'ముందు లోపలికిరా తమ్ముడూ' అని సోలమన్ జానీని లోపలి తీసుకెళ్ళాడు. ఇద్దరూ కూర్చున్నాక, 'ఇప్పుడు చెప్పు తమ్ముడు ఏంటి విశేషం!' అని అడిగాడు. 'ఇవాళ నా పుట్టిన రోజన్నా అందుకే స్వీట్ ఇద్దామని వచ్చాను. ఇవాళ్టితో నాకు 20 సంవత్సరాలు నిండాయని' ఉత్సాహంగా చెప్పాడు జానీ. 'చాలా సంతోషం తమ్ముడూ, పుట్టిన రోజు శుభాకాంక్షలు అంటూ ఎస్తేర్ ఒకసారి ఇలారా అని కేకేశాడు'. ఎస్తేర్ అక్క వచ్చి తాను కూడా శుభాకాంక్షలు చెప్పి 'టిఫిన్ చేసి వెళ్ళమని' చెప్పి లోపలికి వెళ్ళింది.

తర్వాత ఇద్దరూ జానీ కుటుంబం, ఆత్మీయ జీవితం, చదువు గురించి అనేక విషయాలు మాట్లాడుకున్నారు. ఈలోపు ఎస్తేర్ అక్క ఇద్దరికీ టిఫిన్ తీసుకొని వచ్చింది. ఇద్దరూ టిఫిన్ చేశాక ప్రస్తుతం దేశంలో జరుగుతున్న అనేక విషయాలతోపాటు ఎన్నికల ప్రస్తావన కూడా వచ్చింది. జానీకి 20 సంవత్సరాలు నిండాయన్న విషయం గుర్తుకొచ్చి 'తమ్ముడూ నీవు మొదటి సారి ఓటేయబోతున్నావు! కంగ్రాట్యులేషన్స్' అని చెప్పాడు. 'లేదన్నా నేను ఓటువేయడానికి వెళ్ళడం లేదు, ఎందుకంటే ఈ మురికి రాజకీయాల్ని విశ్వాసులమైన మనం పట్టించుకోకూడదని, ఆ మలినాన్ని మనం అంటించుకోకూడదంటే ఎలక్షన్స్‌కి దూరంగా ఉండాలి. పైగా రోమా 13:1లో "ఏలయనగా దేవునివలన కలిగినది తప్ప మరి ఏ అధికారమును లేదు; ఉన్న అధికారములు దేవునివలననే నియమింపబడి యున్నవి" అని రాయబడి ఉంది, దాని అర్థం ప్రభుత్వాలను నిర్ణయించేది మనం కాదు కాబట్టి ఓటు వేయకూడదని' అనుకొంటున్నాను అన్నాడు.'అయ్యో! జానీ, అవగాహన రాహిత్యం వలన ఇలాంటి నిర్ణయం తీసుకొన్నావు. ఇవాళ కాలేజీకి సెలవే గదా, లంచ్ కూడా మాఇంట్లోనే చేద్దా. నీకు ఎలక్షన్స్, ఓటు హక్కు లాంటి విషయాల మీద అవగాహన కలిగించాలి. ఇది ఇప్పుడు నీకు చాలా అవసరమని' సోలమన్ చెప్పడం మొదలు పెట్టాడు.

### ప్రజాస్వామ్యానికి ఓటే పునాది

ప్రజాస్వామ్యానికి ఓటే పునాది. ఓటు అనే రెండక్షరాల పదం దేశ చరిత్రనే మార్చేస్తుంది. స్వాతంత్ర్యానికి ముందు భారతదేశంలో కేవలం 13% మందికి మాత్రమే ఓటు హక్కు కల్పించారు. డా.బి.ఆర్. అంబేద్కర్ 1928లో సైమన్ కమీషన్ ముందు హాజరైనప్పుడు అందరికీ ఓటు హక్కు కల్పించమని వారిపైన ఒత్తిడి తీసుకొని వచ్చాడు. ఓటు హక్కు అందరికీ కల్పించాలనే వాదనకు, స్త్రీలకు సమాన హక్కులు కల్పించాలనే వాదనకు మూలం మోతీలాల్ నెహ్రూ సమర్పించిన రిపోర్ట్. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జనవరి 26, 1950లో కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష అనే భేదం లేకుండా దేశంలో నివసిస్తూ 21 సంవత్సరాలు నిండిన పౌరులు అందరికీ భారత రాజ్యాంగం ఆర్టికల్ 326 ద్వారా ఓటు హక్కును కల్పించింది. ఓట్లు వేసిన వ్యక్తులను 'ఓటర్లు' అని పిలుస్తారు. భారత రాజ్యాంగంలోని 61వ సవరణ రాజ్యాంగ చట్టం 1988 ద్వారా, లోక్‌సభ మరియు రాష్ట్ర శాసన సభలకు ఎన్నికల కోసం ఓటింగ్ వయసును 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించారు.

### ఓటు వేయడం మన బాధ్యత

అధికారంలో ఉన్న పార్టీని అధికారం నుంచి

దించడానికి లేదా కొనసాగించడానికి లేదా అధికారంలో లేని పార్టీని అధికారంలోనికి తీసుకొని రావడానికి ప్రజలకు ఓటు అనే రాజ్యాంగ హక్కు ఉన్నందున ప్రజలను రాజకీయ సార్వభౌమాధికారులని పిలు స్తారు.

ఓటు వేయటం కేవలం రాజ్యాంగ హక్కు మాత్రమే కాదు, 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తి యొక్క గురుతర బాధ్యత కూడా. ఇది దేవుడు నీకు ఇచ్చిన అవకాశం, బాధ్యత. అల్పసంఖ్యాక వర్గాలకి (క్రైస్తవులకు, ముస్లింలకు), షెడ్యూలు కులాల వారికి, షెడ్యూలు తెగలవారికి, స్త్రీలకు, సమాన హక్కులకు గ్యారంటీగా ఓటు హక్కు నిలుస్తుంది. ఎలక్షన్స్, ఓటు హక్కు లాంటి విషయాల మీద అవగాహన కలిగించడానికి కేంద్ర ప్రభుత్వం జనవరి 25 ను జాతీయ ఓటర్ల దినోత్సవంగా ప్రకటించింది. అంతేకాదు అందరూ ఓటు వేయాలనే ఉద్దేశంతో ఎలక్షన్స్ జరిగే రోజును సెలవు దినంగా కూడా ప్రకటించింది.

ఓటు వేస్తే నీకు నచ్చిన వారిని నీవు ఎన్నుకున్నట్లు. వేయకపోతే ఆటోమ్యాటిక్‌గా గెలిచిన వారికి నీవు ఓటు వేసినట్లవుతుంది. అందుకే ఓటు వేయడం ప్రతి ఒక్కరి కనీసపు బాధ్యత. ప్రపంచంలో నీవు ఎక్కడవున్నా, నీకు ఓటు ఎక్కడ ఉంటే ఆ ఊరికి వెళ్ళి ఓటు వేయాలి. నీవు వేసే ఓటు నిన్ను మాత్రమే కాదు, ఆ నియోజకవర్గ ప్రజలను, ఆ రాష్ట్ర ప్రజలను, దేశ ప్రజలను ప్రభావితం చేస్తుంది. 4 సంవత్సరాల క్రితం అమెరికాలో జరిగిన ఎన్నికలలో ప్రతి 5 మందిలో ఇద్దరు క్రైస్తవులు ఆ హక్కును లైట్‌గా తీసుకొని ఓటు వేయలేదు. క్రైస్తవులలో 5 మందిలో ఒకరు ఓటు నమోదు చేసుకోలేదు. దీనివలన అక్కడ దేవుని మీద విశ్వాసం లేని వారు అధికారంలోకి వచ్చారు. కాబట్టి ఇక్కడ 18 సంవత్సరాలు నిండిన ప్రతి క్రైస్తవుడు ఓటును నమోదు చేసుకోవాలి, ఎలక్షన్‌లో తప్పకుండా ఓటు వేయాలి.

## నోటా ఓటింగ్

నీకు ఎవరూ నచ్చకపోతే నోటాకు (నన్ ఆఫ్ ద అబౌవ్) ఓటు వేసే అవకాశం 2014 ఎన్నికల నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వం ఈవియం మెషిన్స్‌లో అభ్యర్థుల పేర్లు, గుర్తులతో పాటు నోటాను కూడా ఏర్పాటు చేసింది. ఓటరు ఈ బటన్ నొక్కితే ఓటు హక్కును వినియోగించుకున్నట్లే. కానీ నోటాకు మెజారిటీ ఓట్లు వచ్చినప్పటికీ మళ్ళీ ఎలక్షన్ జరపకుండా ఉన్న అభ్యర్థులలో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వారిని విజేతలుగా ప్రకటిస్తున్నారు.

## ఓట్ ఫ్రమ్ హోం

2023 కర్ణాటక శాసనసభ ఎన్నికల నుంచి కొత్తగా ఓట్ ఫ్రం హోం విధానాన్ని అమలు చేశారు. ఈ విధానంలో 80 ఏళ్ళు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు తమ ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయం కల్పించారు. అయితే, ముందస్తుగా సదరు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. 2023 తెలంగాణ శాసనసభ ఎన్నికలలో ఈ తరహాలో 28,057 మంది తమ ఓటు హక్కును బ్యాలెట్ ద్వారా వినియోగించుకొన్నారు. కాబట్టి మీ ఇంట్లో 80 సంవత్సరాలు నిండిన వృద్ధులు ఉంటే వారికి ఈ సదుపాయం గురించి వివరించి వారు కూడా ఓటు హక్కును వినియోగించుకొనేలా చేయవచ్చు.

## టెండర్ ఓటు / ఛాలెంజ్ ఓటు

దొంగ ఓట్ల వల్ల లేక ఇతర కారణాలతో మన ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి వచ్చినప్పుడు తిరిగి దాన్ని పొందే హక్కును భారత ఎన్నికల సంఘం 1961లో తీసుకొచ్చిన సెక్షన్ 49(పి) అవకాశం కల్పిస్తోంది. దీని ద్వారా ఓటు పొందాలనుకొనేవారు ముందుగా ప్రిసైడింగ్ అధికారిని కలవాలి. ఓటు కోల్పోయిన వ్యక్తి తానే అని ఆయన ముందు నిరూపించుకోవాలి. దీనికోసం ఓటర్ గుర్తింపు కార్డు, ఇతర గుర్తింపు పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అలాగే ఎన్నారైలు అయితే పాస్‌పోర్ట్ చూపించాలి. ప్రిసైడింగ్ అధికారి ఇచ్చే ఫామ్ 17(బీ) పూర్తి చేసి టెండర్ బ్యాలెట్ పేపర్‌ను పొందాలి. ప్రత్యేక కవరులో ఈ ఓటును భద్రపరిచి కౌంటింగ్ కేంద్రానికి పంపిస్తారు. సెక్షన్ 49(పీ) ద్వారా పొందే ఓటు హక్కును టెండర్ ఓటు, ఛాలెంజ్ ఓటు అంటారు.

## ప్రాక్సీ ఓటు

ప్రాక్సీ ఓటు అనేది తమకు బదులుగా ఇతరులను పంపి ఓటు వేయడం. పోలీసు, రక్షణ శాఖల్లోని ఇంటెలిజెన్స్, గూఢచారి సిబ్బంది తమ ఓటుహక్కును వినియోగించుకోవడానికి ఈ అవకాశం కల్పించారు. 2003లో, తమ తరఫున ఓటు వేయడానికి ప్రాక్సీని నియమించుకోవడానికి వీలుగా భారతదేశ ప్రజా ప్రతినిధి చట్టం సవరించారు.

### బైబిల్ ఏమి చెబుతోంది

బైబిల్ మన నాయకుల కోసం ప్రార్థించమని చెబుతోంది (1 తిమోతి 2:1-4). రాజకీయాలు మన నాయకత్వ ఎంపికలపై దేవుడు అసంతృప్తి చెందాడని చెబుతోంది (హోషేయ 8:4). భూమిపై చాలా బాధలు దైవభక్తి లేని నాయకత్వం వల్లనే వస్తాయని చెబుతోంది (సామెతలు 28:12). ప్రభువు ఆజ్ఞలకు విరుద్ధంగా ఉంటే తప్ప చట్టబద్ధమైన నియమాలన్నీ పాటించాలని బైబిల్ క్రైస్తవులకు సూచనలు ఇస్తుంది (అపో.కా. 5: 27-29; రోమా 13:1-7.)

ఓటు వేయడం అనేది దైవిక ప్రభుత్వాన్ని ప్రోత్సహించడానికి, రక్షించడానికి, సంరక్షించడానికి ఒక అవకాశం. ఈ అవకాశాన్ని దాటవేయడం అంటే క్రీస్తు నామాన్ని దిగజార్చే వారిని మన జీవితాల్లోకి అనుమతించడమే. మనం ఎన్నుకొనే నాయకులు మన స్వేచ్ఛపై గొప్ప ప్రభావాన్ని చూపుతారు. వారు మన ఆరాధన, సువార్తను వ్యాప్తి చేసే హక్కును కాపాడడానికి ఎంచుకోవచ్చు లేదా వారు ఆ హక్కులను పరిమితం చేయవచ్చు. కాబట్టి ఎవరికి ఓటు వేయాలో జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలి. క్రైస్తవులుగా, మన పౌర కర్తవ్యాలను నెరవేర్చడానికి మనం నిలబడి మన ఆజ్ఞను పాటించాలి (మత్తయి 22:21).

### ఎలాంటి వారికి ఓటు వేయాలి?

క్రైస్తవ సూత్రాలను, నైతికతను ప్రోత్సహించే నాయకులకు ఓటు వేయడం ప్రతి క్రైస్తవుడి కర్తవ్యం, బాధ్యత. కొన్ని విషయాలలో దేవుడు నీ ద్వారా తన స్వారభౌమ అధికారాన్ని చెలాయిస్తాడు, అధికారంలోకి ఎవరు రావాలనేది నీకు ఇవ్వబడిన ఓటు హక్కు ద్వారా నిర్ణయిస్తాడు. నేటి రాజకీయాలలో ఎవ్వరూ నీతిమంతులు, పరిపూర్ణులుగా కనబడరు. పోటీలోవున్న అభ్యర్థులలో ఎవరు మంచివారు, యోగ్యులు, సమాజానికి మేలు చేసే వారెవరో ఆలోచించి ఎంపిక చేసుకోవాలి.

### ప్రలోభాలు

దేశ, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించడానికి ఓటు ఉపయోగపడుతుంది. డబ్బుకు, చర్చ్ నిర్మాణానికి ఇచ్చే నగదుకు ఆశపడి, ప్రోత్సాహాలకు, సిలువ ఆకారంలో ఉన్న ఉచిత బహుమతులకు, ఓటు అమ్ముకోకుండా ఓటుహక్కు వినియోగించుకోవాలి. చట్టప్రకారం ఎన్నికలలో ఉచిత బహుమతులు తీసుకోవడం లేదా ఇవ్వడం నేరం. ఇలాంటి ప్రలోభాలకు లోబడకుండా ఇతరులను క్రైస్తవులు చైతన్యం చేయాలి. ఇలాంటి దుష్ప్రవర్తనకు సంబంధించిన సంఘటనలను మీరు చూసినట్లయితే, హెల్ప్ లైన్ నంబర్ 1950కి ఫోన్ చేసి చెప్పండి లేదా CVIGIL యాప్ ద్వారా తెలియజేయండి. దేవుడు మనలను నైతిక వ్యక్తులుగా సృష్టించాడు కాబట్టి మనం నైతిక ఓటర్లుగా మెలు గుదాం. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో మన వంతు పాత్రను పోషించాలి.

### ప్రభుత్వ ఉద్యోగులు

ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన నిష్పక్షపాతంగా ఉండాలి. ఏ రాజకీయ పార్టీకీ, అభ్యర్థికీ, అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే సందేహాలు, ఆరోపణలకు ఆస్కారమివ్వకూడదు. ఉద్యోగులు రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొన్నా, పార్టీల నుంచి ప్రయోజనం, బహుమతి పొందినా, అనుచితంగా ప్రభావితం చేసేందుకు ప్రయత్నించినా అది ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధం. నిబంధనలు ఉల్లంఘించిన ప్రభుత్వోద్యోగులపై ఐపీసీ సెక్షన్ 171, 123తో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 134, 134ఏ సెక్షన్స్ కింద చట్టపరమైన, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. కాబట్టి, విశ్వాసులైన ప్రభుత్వ ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాలి. ఆఫీసుల్లో పనిచేసేవారు, కళాశాలలో పని చేసేవారు రాజకీయాలు, రాజకీయ నాయకులు, ఎలక్షన్స్‌లో ఎవరు గెలుస్తారనే వాటి గూర్చి వాదనలు పెట్టుకోకూడదు. వాటి గురించి ప్రస్తావన సహోద్యోగులు తీసుకువచ్చినా ఆ చర్చ నుంచి తప్పించుకొని వెళ్ళాలి.

### ముగింపు

'జానీ అర్థమైందా, ఎవరు ప్రభుత్వంలోనికి రావాలనే నిర్ణయాన్ని దేవుడు నీ చేతిలో పెట్టాడు. దాన్ని సద్వినియోగం చేసుకోకపోతే మనం ఆయనకు అవిధేయత చూపినవారం అవుతాము. కాబట్టి తప్పకుండా ఓటు వేయడానికి వెళ్తావు కదా' అని అన్నాడు సోలమన్. 'అవునన్నా తప్పకుండా ఓటు వేస్తాను'. సరే జానీ చిన్న ప్రార్థన చేసుకొని భోజనం చేద్దాం అంటూ సంభాషణ ముగించారు.

– డా. వైవిఆర్ ప్రసన్న కుమార్, సూర్యాపేట

ప్రత్యేకం

# దేవుని సంఘం రాజకీయాలు













## సంఘమంటే ఏంటి?

సంఘం, భూమి పునాదులు వేయబడకముందే దేవుని మనసులో ఉన్న అద్భుత ఆలోచన. దానిని దేవుడు తన మనసులో భద్రంగా దాచి యుంచుకొని (ఎఫెసీ 3:5), ఆ సంకల్పాన్ని వాస్తవికతలోనికి తేవడానికి ఆయన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువును మానవ శరీరాకారంతో పంపి, ఆయన సిలువ మరణ పునరుత్థానముల ద్వారా మానవ పాపానికి ప్రాయశ్చిత్తం కలగచేశాడు. ఆయన చేసిన ఈ విమోచన కార్యము నందు విశ్వాసముంచి పాపక్షమాపణ పొందిన వ్యక్తుల సమూహమును రెండవ సృష్టిగా చేసి (2 కొరింథీ 5:17), ఒక నూతన మానవ జాతిని ఏర్పరచి వారికి 'సంఘము' అని నామకరణం చేశాడు.

## సంఘము ఎలా ఏర్పడింది?

ప్రభువు మరణం జయించి తిరిగి లేచిన తర్వాత 50 రోజులకు యూదుల పెంతెకొస్తు పండుగ దినము వస్తుంది. ఆ రోజున 120 మంది శిష్యులు అని పిలువబడ్డ విశ్వాసులు ఒక ఇంటిలో కూడుకొని యుండగా, దేవుడు ముందుగా ప్రమాణం చేసినట్లుగా త్రిత్వంలోని మూడవ వ్యక్తియైన పరిశుద్ధాత్మ దేవుడు ప్రత్యక్షంగా మానవ దేహములలోకి ప్రవేశించడం జరిగింది. ఆ దినమును సంఘ ఆవిర్భావదినంగా పరిగణిస్తారు. ఆ దినమున శిష్యులు ఆత్మ దేవుని ద్వారా నింపబడి క్రీస్తు ప్రభువును గూర్చిన సత్యమును, దేవుని అద్భుత సువార్త ప్రణాళికను వివరించగా దాదాపు 3000 మంది ప్రభువు నందు విశ్వాసముంచి సంఘానికి చేర్చబడ్డారు. ఆ విధంగా యెరూషలేములో ప్రారంభమైన సంఘము, అపొస్తలుల ద్వారా పరిసర ప్రాంతాలకు, పరిసర దేశాలకు, చివరకు ప్రపంచమంతా వ్యాపించింది.

## సంఘంపై సాతాను దాడి

ప్రారంభ సంవత్సరాలలో సంఘాలు చిన్న చిన్న గుంపులుగా గృహాలలో చేరి ప్రభువును ఆరాధించేవారు. మూడవ శతాబ్దంలో (ఏడి 240) విశ్వాసులు చర్చ్ భవనాలను కట్టి, వాటిలో ప్రభువును ఆరాధించడం ప్రారంభించారు. వీటిని స్థానిక సంఘాలుగా గుర్తించారు. మొదటి రెండు శతాబ్దాలలో సంఘం చాలా హింసను, తృణీకారాన్ని ఎదుర్కొంది. కానీ కాన్స్టాంటైన్ అనే రోమా చక్రవర్తి క్రైస్తవునిగా మారినప్పుడు, హింస ఆగిపోయి అనేకులు క్రైస్తవ మతాన్ని స్వీకరించారు. క్రైస్తవ్యం క్రైస్తవ మతంగా, చక్రవర్తి మతంగా మారిపోయింది. పరిశుద్ధ సంఘంలోకి అనేక అన్యాచారాలు, పండగలు, వాక్యాధారంలేని పద్ధతులు వచ్చాయి. రక్షణలేని ప్రజలు బాప్తీస్మ ఆచారం ద్వారా దొమ్మిగా దేవుని సంఘంలోకి చొరబడ్డారు. ఇది దేవుని సంఘంపై సాతానుడు చేసిన గొప్ప మోసకరమైన దాడి అని చెప్పవచ్చు.

## సార్వత్రిక స్థానిక సంఘములు

దేవుని సంఘము విశ్వవ్యాప్తమైనది. దీనిలో యూదుడని, అన్యుడని, ధర్మశాస్త్రమును ఆచరించు వాడని, ఆచరించని వాడని, జాతి, అంతస్తు, మరి ఏ భేదము లేక అందరూ సమానంగా ఒక తండ్రి పిల్లల వలె ప్రేమతో ఒకరికొకరు లోబడి జీవించే అద్భుత సమాజము (కొలస్సీ 3:11). ప్రపంచమంతటా ఉన్న విశ్వాసుల సమూహాన్ని సార్వత్రిక సంఘము

అని పిలుస్తారు. స్థానికంగా ఉన్న సంఘములు ఆ సార్వత్రిక సంఘమును ఏర్పరచే శాఖలు. ఒక వ్యక్తి రక్షణ పొందిన వెంటనే ఆత్మద్వారా సార్వత్రిక సంఘములో చేర్చబడతాడు. తన ఆత్మీయ అభి వృద్ధికి, ఆరాధనకు ఆ వ్యక్తి బాప్తిస్మ కార్యక్రమం ద్వారా స్థానిక సంఘ సభ్యునిగా కొనసాగుతాడు. కానీ ఈ క్రమాన్ని స్థానిక సంఘములు పాటించని కారణంగా రక్షించబడని వ్యక్తులు సంఘ సభ్యులుగా సంఘ నాయకత్వములోకి ప్రవేశించడం ద్వారా సంఘము దేవుని వాక్య విధానము నుంచి తొలగిపోయింది. క్రీస్తు శరీరమునకు పోల్చబడిన సార్వత్రిక సంఘములో పాలిభాగస్తులైన స్థానిక సంఘములు లోక వ్యవస్థ ద్వారా ప్రభావితమై ఉప్పులాగా, వెలుగులాగా ఉండి తన ప్రభావాన్ని లోకముపై చూపలేని వ్యవస్థగా మారి పోవడం దు:ఖకరం.

## సాతానుడి గురి సంఘమే

స్థానిక సంఘములలో రాజకీయాలు, అధికారాల కోసమైన వర్గపోరాటాలు, ధనవ్యామోహం, కలహాలు, కోర్టు వ్యవహారాలు కేవలం 20వ శతాబ్దపు పోకడలని తలంచకూడదు. సంఘం ప్రారంభమైనప్పటి నుండి సాతానుడి గురి సంఘమే. ప్రభువు ఈ ప్రమాదాల గురించి మత్తయి 13:24-30 వచనాలలో గోధుమలు -గురుగులు ఉపమానములో వివరించారు. ప్రతి స్థానిక సంఘములో సాతానుడు తన ఏజెంట్లను కలిగి ఉంటాడని దేవుని వాక్యం స్పష్టంగా చెబుతుంది. పౌలు ఎఫెసు సంఘ పెద్దలను పిలిపించి చెప్పిన హెచ్చరికలలో కూడా ఈ తోడేళ్ళలాంటి మనుష్యుల గురించి చెప్పబడింది (అపొ.కా. 20:17-35). ఈ క్రూరమైన తోడేళ్ళు (29వ) అధికారం కోసం, మనుష్యులను గుంపులుగా విభజిస్తారు, అమాయకు లైన విశ్వాసులను మోసగిస్తారు.

## సంఘాల్లో రాజకీయాలకు కారణాలు

మన భారతదేశంలో ప్రాముఖ్యమైన క్రైస్తవ మతశాఖలుగా ఉన్న దక్షిణ భారత చర్చి, ఉత్తర భారత చర్చి, లూథరన్, బాప్టిస్టు, పెంతెకొస్తు సంఘములు, మెథడిస్ట్ మొదలైనవి ప్రాముఖ్యమైన శాఖలు. ఇవి కాకుండా అనేకమైన స్థానిక సంఘాలు వ్యక్తుల ద్వారా ప్రారంభిచబడినవి, సొసైటీల ద్వారా నడిపించబడేవి, ట్రస్ట్‌ల ద్వారా పరిపాలించబడేవి కూడా ఉన్నాయి. ఏ సంఘమైనా దేవుని వాక్యమునకు, వాక్య సత్యమునకు వేరుగా నడపబడుచున్నప్పుడు, సంఘ సభ్యుల యొక్క

> సంఘములలో ఉన్న సమస్యలకు, రాజకీయాలకు కారణం రక్షణపొందని వారు, విశ్వాసుల ముగుసులో ఉన్న అవిశ్వాసులు, విశ్వాసులై యుండి ఎదుగుదల లేని శరీర సంబంధులైన విశ్వాసులు (1 కొరింథీ 3:1-3). వీరు తమలోని పాపమును జయించలేని బలహీనులు. ఆత్మఫలము లేని ఫలహీనులు. తమలోని అహంభావానికి దాసులు. లోకసంబంధమైన జ్ఞానము గలవారు.

ఆత్మీయ జననము ప్రశ్నార్థకముగా ఉన్నప్పుడు ఆ సంఘములో తప్పక సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇవి సంఘ సిద్ధాంతపరమైన సమస్యలు. చాలా సంఘములు వాక్యపరంగా లోపము లేని సిద్ధాంతము కలిగి ఉన్నప్పటికీ, ఆ సంఘములలో ఉన్న సమస్యలకు, రాజకీయాలకు కారణం రక్షణపొందని వారు, విశ్వాసుల ముసుగులో ఉన్న అవిశ్వాసులు, విశ్వాసులై యుండి ఎదుగుదల లేని శరీర సంబంధు లైన విశ్వాసులు (1 కొరింథీ 3:1-3). వీరు తమలోని పాపమును జయించలేని బలహీనులు. ఆత్మఫల ము లేని ఫలహీనులు. తమలోని అహంభావానికి దాసులు. లోకసంబంధమైన జ్ఞానము కలవారు (యాకోబు 3:15-16; 4:1-2).

## ధన వ్యామోహమే సమస్యలకు మూలం

క్రైస్తవ సంఘములలో అధికారం కోసమైన తగవులు, కలహాలు, కోర్ట్ కేసులు కళ్ళారా చూస్తు న్నాము. దీనికంతటికీ మూలకారణం ధన వ్యామోహం. క్రైస్తవ సంఘములలో ఏమి ఉన్నా లేకపోయినా ప్రతి ఆదివారం కానుకలు స్వీకరించడం తప్పకుండా జరుగుతుంది. సంఘానికి వెళ్ళే ప్రతి వారు రక్షణ పొందినవారైనా, పొందని వారైనా కానుకలు ఇవ్వడానికి వెనుకాడరు. దానికి మూల ము మన దేశములోగల ఆచారాలు మొక్కుబడులు. దేవుని అనుగ్రహం పొందడానికి ధనాన్ని ఇవ్వడం ప్రాచీన కాలం నుండి వచ్చే మూఢాచారం. దేవుని వాక్యంలో పాతనిబంధనలో రాయబడిన దేవుని మందిరం అనే మాటకు చర్చ్ అనే భాష్యం ఇవ్వడం, పాతనిబంధనలోని దశమభాగం ఇవ్వాల

నే ఆజ్ఞ, మొక్కుబడులు మొదలగు దురభి ప్రాయాలను సంఘంకాపరులు వారికి అనుకూలంగా మరల్చుకోవడం వలన ధనాన్ని కూర్చొకోవడానికి అవకాశంగా మారింది. వ్యక్తులు తాము కానుక పెట్టెలో వేసే కానుక దేవుడు అంగీకరిస్తున్నాడా? లేదా? అని ఆలోచించరు. ఆ కానుక దేవుని సేవకు పరిచర్యకు ఉపయోగిస్తున్నారా? లేదా? అని కూడా ఆలోచించరు. క్రైస్తవ సంఘాలలో గల ఈ ధనమే అనేక సమస్యలకు కారణమయ్యింది.

## విభజనలు సాతాను పనే

సంఘాల్లోన్ని డబ్బు స్వాధీనం చేసుకోవడానికి, అధికారం చేజిక్కించుకోవాలనుకొనే నాయకులు అనేకులు. అధికారం కోసం తమ కులం వారిని సమకూర్చుకోవాలి. ఎప్పుడైతే దేవుని సంఘములో కుల ప్రస్తావన వస్తుందో అది విభజనకు దారి తీస్తుంది. దేవుడు మనుష్యులు కట్టుకొన్న విభజన గోడలను కూలద్రోసి ఆయన రక్తంలో విమోచించి రక్షించబడిన వారందరిని ఒకే కుటుంబంగా చేశాడు. కాబట్టి దేనిని దేవుడు కలిపాడో దానిని విడదీయడం సాతాను క్రియ. ఈ గుంపులు కట్టడం లోకసంబంధమైన రాజకీయం గాక మరేంటి? (1 కొరింథీ 3:3,4).

## స్థానిక సంఘాలు ఎలా ఉండాలి?

సంఘాలు పరిశుద్ధతకు, యధార్థతకు, ప్రేమకు, సత్యానికి మారుపేరుగా ఉండాలి. సంఘం యొక్క బలం దాని ఐక్యతలో ఉంటుంది. ఎక్కడైతే సంఘనాయకులు దేవుని ప్రేమతో ఐక్యతతో ఉంటారో, అక్కడ ఆశీర్వాదం, శాశ్వత జీవం ఉండాలని దేవుడు ఆజ్ఞాపిస్తాడు (కీర్తనలు 133:3). దేవునిలోని ఏకత్వం, సంఘంలో, సంఘమును ఏర్పరచే విశ్వాస కుటుంబాలలో, సంఘ నాయకత్వంలో ఉండాలని దేవుని కోరిక. అలాంటి సంఘంలో దేవుని అధ్యక్షత, అధికారం ఉంటుంది. ఆ సంఘంలో నాయకులు క్రీస్తు మనసు కలిగి సేవకుల్లాగా పరిచర్య చేయగలిగితే సంఘం అంతా వారి మార్గంలో నడుస్తుంది. ఆ లోకంలో యధార్థత, తగ్గింపు, నిజప్రేమ కనపడవు. అలాంటి లోకానికి సంఘం దేవుని ప్రేమను, క్రీస్తు మనసును చూపగలిగితే, క్రైస్తవ్యం మతం కాదు అది జీవన విధానం అని భారతదేశం తెలుసు కొంటుంది.

## యుఇయస్ఐ సభ్యులుగా స్థానిక సంఘంలో బాధ్యత ఏంటి?

మన దేశంలో రాజకీయాలు లేని సంఘాలను వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. అలాంటి పరిస్థితుల్లో ఒక గ్రాడ్యుయేట్‌గా మన పాత్ర సంఘంలో ఎలా ఉండాలి? యుఇయస్ఐ సభ్యులు వారి వారి సంఘాలకు క్రమంగా హాజరవుతూ విశ్వాసులు, పెద్దలు, సంఘ కాపరితో మంచి సంబంధాలు కలిగి ఉండాలి. సంఘంలో ఏదైనా పని అప్పగించినప్పుడు దాన్ని నమ్మకంగా చేయాలి. సంఘ రాజకీయాలకు మనం దూరంగా ఉండాలి.

యుఇయస్ఐ సభ్యులు తన వాక్య విధాన స్థానాన్ని నిర్ద్వందంగా సంఘమునకు, సంఘ నాయకత్వానికి తెలియజేయాలి. తాను ఏ వర్గానికి చెందినవాడిని కానని, క్రీస్తు ప్రభువు రాయభారిగా, ప్రతినిధిగా, దేవుని వాక్య విధానానికి నూటికి నూరుపాళ్ళు కట్టుబడి ఉంటానని తెలియజేయాలి, ఆవిధంగా జీవించాలి. పరిశుద్ధ జీవన విధానం, యధార్థత ఇతరులలో దేవుని భయాన్ని తప్పక కలుగజేస్తుంది. సాధ్యమైతే రెండు వర్గాల మధ్య సమాధానం కోసం ప్రార్థించి నీవంతు పాత్ర వహించు. సంఘంలో జరిగే దేవుని వాక్య విరోధ వర్గ పోరాటం, ధన వ్యామోహం, అధికార దుర్వినియోగం పాపమని ధైర్యంగా చెప్పగలగాలి. ప్రభువు మన పక్షమైతే విరోధులకు భయపడాల్సిన పనిలేదు. కొద్దిమంది విశ్వాసులను ప్రార్థనకు కూర్చి సంఘ నాయకత్వము కొరకు, సంఘము కొరకు కన్నీటితో ప్రార్థించడానికి ప్రోత్సహించవచ్చు.

సంఘ నాయకులు అవకాశమిస్తే సంఘంలోని యవ్వనస్థులకు సువార్తను ప్రకటించి, బైబిల్ స్టడీస్‌ను నిర్వహించి వారిని ఈ సంఘ రాజకీయాల నుండి దూరపరచి వారి ద్వారా రాబోయే తరానికి మంచి నాయకత్వాన్ని సిద్ధం చేయవచ్చు. సంఘాన్ని గూర్చిన సత్యాన్ని సంఘ నాయకులకు, సభ్యులకు తెలియజేయడం సాహసోపేతం అయినప్పటికీ ప్రభువు సహాయంతో ఈ గొప్ప పనికి పూనుకొని మన రాష్ట్రంలోని మన క్రైస్తవ సంఘాలను ప్రభావితం చేద్దాం. కట్టుటకు పూనుకొందము రండి! ఈ మంచి కార్యము చేయుటకై బలము తెచ్చుకొందాం! (నెహెమ్యా 2:18).

– కె. దేవిడ్ రాజ్ కుమార్, గుంటూరు



# దేవుడు

## ఉన్నాడా? ఎందుకు తెలుసుకోవాలి? ఎలా ఉంటాడు? భిన్న నమ్మకాలు ఏమిటి?

"లోకం దేవుని గూర్చిన జ్ఞానం లేక నశిస్తూ ఉంటే, క్రైస్తవ సంఘం దేవుని సన్నిధి లేని క్షామంతో అలమటిస్తుందని" అంటారు టోజర్ భక్తుడు. దేవుని గూర్చిన జ్ఞానం, ఆయన సన్నిధి కొరవడినప్పుడు అది మానవాళి మనుగడకే ప్రమాద కారణమౌతుంది. అందుకే "దేవుడు ఉన్నాడా? ఒక వేళ ఉనికిలో ఉంటే ఆయన స్వభావం ఏంటి?" అన్న రెండు ప్రశ్నలకు మనం ఇచ్చే జవాబులు మానవ జీవితాన్ని నిర్వచించి, భవిష్యత్‌ను గమ్యాన్ని నిర్దేశిస్తాయి అంటారు ప్రముఖ క్రైస్తవ మేధావి రవిజకర్యా. కొన్ని కోట్లమంది ప్రజల నరమేధానికి, 20వ శతాబ్ధం అత్యంత రక్తపాత శతాబ్ధంగా మారడానికి "దేవుడులేడు" అని జనరంజకంగా బోధించిన నీచే లాంటి వారి తాత్విక రచనలు, ఈ భావాజాలాన్ని సమాజంలో అమలు చేయడానికి హిట్లర్ లాంటివారు చేసిన ప్రయత్నాలు కారణమన్న సంగతి ఇక్కడ గమనార్హం. మనిషి గుర్తింపుని, స్వభావాన్ని, జీవిత పరమార్థాన్ని, జీవిత గమ్యాన్ని తెలుసుకోవడానికి దేవుని గూర్చిన జ్ఞానం అనివార్యం. దేవుడు ఎవరో తెలియకుండా మనిషికి తాను ఎవరు అన్న సంగతి తెలియదు. కాబట్టి దేవునిని తెలుసుకోవడమంటే మన జీవితాన్ని గురించిన అత్యంత విలువైన, ప్రాథమిక ప్రశ్నల జవాబును అన్వేషిస్తున్నట్లే. అందువలన దేవుని గురించిన అంశం మన జీవితాలకు సంబంధంలేని విషయంగా పరిగణించడానికి లేదు. ఆయనను తెలుసుకోవడం ఆయనతో వ్యక్తిగత సంబంధంలోకి రావడం ద్వారా మాత్రమే మన జీవితాలకు అర్థం, పరమార్థం చేకూరతాయి.

### దేవుని గూర్చిన భిన్న నమ్మకాలు

ప్రజలందరూ వాడే పదం "దేవుడు" ఒక్కటే అయినా, అందరూ ఒకే దేవుణ్ణి నమ్ముతున్నారు అనుకోవడం అజ్ఞానమే అవుతుంది. ఎందుకంటే దేవుని గురించి ప్రజల్లో చాలా భిన్నమైన అభిప్రాయాలు, నమ్మకాలు ఉన్నాయి. ఈ నమ్మకాలు భిన్నమైనవే కాదు పరస్పర విరుద్ధమైనవి కూడా. కాబట్టి అన్ని నమ్మకాలు ఏక కాలంలో సత్యమయ్యే అవకాశమే లేదు.

- **నాస్తికులు (నిరీశ్వరవాదం)** (Atheism) – దేవుడు లేడు అంటారు. భౌతిక ప్రపంచానికి భిన్నమైన వాస్తవం ఏదీ లేదు అనేది వీరి వాదన.
- **అజ్ఞతవాదులు** (Agnosticism) – దేవుణ్ణి ఎన్నటికీ తెలుసుకోలేము అంటారు.
- **బహుదేవతావాదులు** (Polytheism) – పరిమితి కలిగిన అనేక దేవుళ్ళు ఉన్నారు అనేది వీరి నమ్మకం.
- **సర్వేశ్వరవాదులు** (Pantheism) – దైవమే సర్వం, సర్వం దైవం అని, అంతిమ వాస్తవమైన దైవం వ్యక్తిత్వంలేని 'నిర్గుణం' అంటారు.
- **అతీతేశ్వరవాదులు** (Deism) – దేవుడు విశ్వానికి

అతీతంగా ఉండి, దానిలోని వ్యవహారాలతో ఏ మాత్రం సంబంధం లేకుండా ఉంటాడు అని నమ్ముతారు.

* **ఆస్థికవాదులు** (Theism) – దేవుడు విశ్వానికి అతీతంగా ఉండి, దానిని నడిపిస్తూ ఉన్నాడు అని అంటారు.

ప్రపంచానికి హేతుబద్ధంగా ఆలోచించడం నేర్పించి, అనేక మంది తాత్వికుల్ని తయారు చేసిన ఏథెన్స్ గడ్డమీద కాలుమోపి, మృత్యువును జయించి తానే సత్యం అన్న క్రీస్తును ప్రకటించడానికి పూనుకున్న పౌలుకు పలు సవాళ్ళు ఎదురయ్యాయి. నిజ దేవునికి చెందవలసిన మహిమను విగ్రహాలకు ఆపాదిస్తూ పట్టణాన్ని విగ్రహాలతో నింపడాన్ని చూసినప్పుడు పౌలు బాధతో చలించి పోయాడు (అపో.కా 17:16). ఒకపక్క 'నాస్థికవాద' భావాజలం ఉన్న ఎపిక్యూరియన్లకు, మరోపక్క 'సర్వేశ్వరవాదులైన' స్తోయికులకు సువార్త చెప్పే సవాలును పౌలు తీసుకొన్నాడు. విగ్రహారాధన చేసే బహుదేవతా వాదులు, సమస్తం దైవం అని నమ్మే సర్వేశ్వరవాదులు, దేవుడు లేడు–ఆయన అవసరం లేదు అని నమ్మే ప్రజలు అధికంగా ఉన్న భారతదేశంలో అదే సవాలు మనకూ ఎదురవుతుంది.

## దేవుడు ఎవరు?

ఆలోచనాపరులు, తాత్వికులు మధ్య నిలబడిన పౌలు దేవునిని ఈ విధంగా పరిచయం చేశాడు.

1. దేవుడు సృష్టికర్త (24వ)
2. దేవుడు మన జీవిత సంరక్షకుడు (25వ)
3. దేవుడు దేశాల పరిపాలకుడు (26,27వ)
4. దేవుడు మానవాళికి తండ్రి (28వ)
5. దేవుడు లోకానికి న్యాయాధిపతి (31వ)

## 1. దేవుడు సృష్టికర్త

సృష్టికి ప్రారంభం లేకుండా నిత్యత్వం నుండి ఉనికిలో ఉంది అనే భావన నాస్థికులకు, సర్వేశ్వరవాదులకు అత్యంత ప్రధానమైన విషయం. ఎందుకంటే, సృష్టి ఒకప్పుడు ఉనికిలో లేనట్లయితే సర్వందైవం అనే సర్వేశ్వరవాదం– ఒకప్పుడు ఉనికిలో లేకుండా ఇప్పుడు ఉనికిలోనికి వచ్చినట్లయితే దాని వెనుక కారకం ఉండాలి కాబట్టి దేవుడు లేడనే నాస్థికవాదం కుప్పకూలిపోతుంది. అందుకే విశ్వం అనంతమైనదని,



ఆరంభం లేకుండా నిత్యత్వం నుండి ఉన్నదని వాదించడానికి వీరు విశ్వప్రయత్నం చేస్తారు.

ఆధునిక ఖగోళశాస్త్ర అవిష్కరణలు ప్రాముఖ్యంగా 19,20 శతాబ్ధాలలో కనుగొన్న శాస్త్రీయ ఆధారాలు విశ్వానికి ఆరంభం ఉందని, అది నిత్యత్వం నుండి ఉనికిలో లేదన్న విషయాన్ని ఋజువు చేస్తున్నాయి.

### ప్రధానమైన రెండు శాస్త్రీయ ఆధారాలు:

**1. ఉష్ణగతిక శాస్త్ర నియమము:** విశ్వంలోని మొత్తం శక్తి స్థిరమైనప్పుడు దానిలోని ఉపయోగకరమైన శక్తి క్రమంగా తగ్గిపోతుంది అనేది వీటి సారాంశం. వీటి ప్రకారం ఒక వేళ విశ్వం నిత్యత్వం నుండి ఉనికిలో ఉన్నట్లయితే విశ్వంలో మొత్తం కేవలం మృత నక్షత్రాలే ఉండాలి, కానీ అలా కాలేదు కాబట్టి విశ్వం నిత్యత్వం నుండి ఉనికిలో లేదన్నమాట.

**2. విశ్వం వ్యాకోచిస్తూ ఉంది:** విశ్వం వ్యాకోచిస్తుందన్న సంగతిని 1929సం॥లో హబుల్ ఖగోళశాస్త్రజ్ఞుడు అనుభవాత్మకంగా (Empirical) ఋజువు చేశాడు. కాలంలో గతానికి వెళ్ళేకొలది ఒక నిర్దిష్ట బిందువు వద్ద స్థలానికి, కాలానికి పరిమితి–ప్రారంభం ఉన్నాయన్నది ఋజువైన విషయం. దీని ప్రకారం మన విశ్వం వయసు సుమారు 13.7బిలియన్ సంవత్సరాలు.

"హేతుబద్ధంగా ఆలోచించే వ్యక్తిని ఒప్పించడానికి ఒక వాదన, పిడివాదం చేసే వ్యక్తిని ఒప్పించడానికి ఒక ఋజువు అవసరం అవుతాయి అంటారు. ఇప్పుడు ఋజువు అందుబాటులో ఉంది గనుక, గతంలో నిత్యత్వం నుండి సృష్టి ఉనికిలో ఉంది అనేభావన వెనుక ఏ ఖగోళశాస్త్రవేత్త దాగుకొనే అవకాశం లేదు. తప్పించుకొనే మార్గమే లేదు. వాళ్ళు విశ్వం ప్రారంభమైందన్న సమస్యను ఎదుర్కొనవలసిందే" అని అంటారు ఖగోళ శాస్త్రజ్ఞుడు అలెగ్జాండర్ విలెంకిన్.

- స్థలానికి, కాలానికి ప్రారంభమున్నది గనుక విశ్వ ఉనికికి కారణమైన దేవుడు స్థల,కాలాలకు అతీతుడు.
- దేవుడు స్థలానికి పరిమితం కాని – సర్వవ్యాపి: కీర్తన 139:7-10
- దేవుడు కాలానికి పరిమితం కాని – నిత్యుడు: యెషయా 57:15; కీర్తన 90:1,2
- దేవుడు అభౌతికుడు, అదృశ్యుడు – ఆత్మ: యోహాను 4:24, 1తిమోతి 1:17
- స్థలానికి పరిమితం కాని దేవునికి రూపాన్ని కల్పించి, ఆయనను ఒక స్థలానికి పరిమితం చేయడం ఆయనను తప్పుగా చిత్రీకరించి ఆయన స్వభావాన్ని వక్రీకరించడమే అవుతుంది. (యోహాను 4:24; అపో.కా 17:24). అందుచేత విగ్రహారాధనను బైబిల్ పూర్తిగా వ్యతిరేకిస్తుంది, అంతేకాదు అది పూర్తిగా అహేతుక చర్య అవుతుంది.
- తను ఎక్కడ ఏ స్థితిలో ఉన్నా దేవుడు అందుబాటులో ఉన్నాడన్న సత్యం కంటే ఓదార్పునిచ్చే సత్యం విశ్వాసికి మరేమి ఉంటుంది!

## 2. దేవుడు మన జీవిత సంరక్షకుడు (25వ)

సృష్టి ఉనికికి కారణమైన కారణాలు అనేకం ఉండడం హేతు విరుద్ధమైన విషయం గనుక కలిగించకుండానే తనకు తానుగా ఉనికిలోఉన్న ఒకే ఒక కారణం ఉనికిలో ఉండాలి.

- దేవుడు స్వయంగా ఉనికిలో ఉన్నవాడు, ప్రారంభంలేనివాడు: నిర్గమ 3:14; రోమా 4:17; ప్రకటన 1:4

దేవుడు మాట సెలవిస్తే ఉనికిలో లేనివి ఉనికిలోకి వస్తాయి (కీర్తన 33:6), మృతులైనవారు సజీవులుగా మారతారు (యెహెజ్కేలు 37:9-10; రోమా 4:17). మన భయాలన్నీ మన బలహీనతలను బట్టి, మరణాన్ని గురించిన భయాన్ని బట్టి కలుగుతాయి. మనం ఆరాధిస్తున్న దేవుడు శూన్యం నుండి సమస్తాన్ని సృష్టించి, మన జీవితాన్ని అనుక్షణం పోషిస్తూ (అపో.కా 17:25), మృతుల్ని సజీవులుగా చేయసామర్థ్యం కలిగినవాడు గనుక ఆయన పట్ల కృతజ్ఞత కలిగి నిర్భయంగా ఆయన చిత్తానుసారంగా పరిచర్యలో ముందుకు సాగాలి.

## 3. దేవుడు దేశాల పాలకుడు (26,27వ)

ప్రతిదేశ భౌగోళిక సరిహద్దులు, చరిత్ర దేవుని ఆధీనంలో ఉన్నాయి (26వ). ఎందుకంటే, ఆయన సార్వభౌముడు. వాటిని నిర్దేశించడంలో దేవుని ఉద్దేశం మనం ఆయనను కనుగొనాలని (27వ). మానవ పరిమిత తత్వం, పతనత్వం వల్ల, మన హేతువు సహాయంతోగాని, పరిశోధన ద్వారా గాని ఆయనను తెలిసికోవడం అసాధ్యం. గనుక తన్నుతాను మనకు కృపచేత ప్రత్యక్షపరచుకొన్నాడు (రోమా 1:19,20; కీర్తన 19:1). దేవుడు సార్వభౌముడు కావడానికి దేవుడు సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞాని, సంపూర్ణ స్వేచ్ఛ కలిగినవాడై ఉండాలి అంటారు టోజర్ భక్తుడు.

- దేవుడు సర్వశక్తిమంతుడు – ఆది.కా 17:1; మత్తయి 19:26
- దేవుడు సర్వజ్ఞాని – కీర్తన 139:1-6; 1 యోహాను 3:19,20
- దేవుడు సంపూర్ణస్వేచ్ఛగలవాడు – కీర్తన 115:3; రోమా 9:19-21

దేవుడు 'శక్తి' కాదు, వ్యక్తిత్వం కలిగిన సార్వభౌముడైన వ్యక్తి గనుక మన ప్రతీ అవసరతల్ని, భావోద్రేకాల్ని, భయాల్ని, బాధల్ని, పరిమితుల్ని, ఉద్దేశాలను సంపూర్ణంగా అర్థం చేసుకోగలడు. ఆయన శరీరధారిగా రావడాన్ని బట్టి మన దేవుడు మన బలహీనతల్లో మనతో సహానుభవం లేనివాడు కాదుగాని మనకు సంపూర్ణంగా సహాయం చేయగలిగినవాడు (హెబ్రీ 4:15).

## 4. దేవుడు మానవాళికి తండ్రి (28వ)

మనల్ని సృష్టించి మనందరికీ జీవాన్ని దయచేయడం ద్వారానే కాదు, పాపం నుండి విడిపించి తన పరిశుద్ధ కుటుంబంలోనికి దత్తత తీసుకోవడం ద్వారా కూడా ఆయన మనందరికి ప్రేమగల తండ్రి.

- దేవుడు త్రియేక దేవుడు గనుక ప్రేమామయుడు – 1 యోహాను 4:8,10; యోహాను 3:16
- దేవుడు మంచివాడు – కీర్తన 145:16; అపో.కా 14:17
- దేవుడు కరుణ కలిగిన వాడు – కీర్తన 103:13; మత్తయి 9:36

**అనంతుడైన దేవునిని ఆయన ప్రత్యక్షత వెలుగులో అర్థంచేసుకోవడం నిరంతరాయంగా జరిగినప్పుడు మన జీవితాలు ఆరాధనకు యోగ్యుడైన దేవుని స్వరూపంలోనికి మారడం తథ్యం!**

- దేవుడు కృప గలిగినవాడు – ఎఫెసీ 2:7-9; తీతు 3:4-7

దేవుని స్వభావమే ప్రేమ, ఈ ప్రేమ పరిపూర్ణమైనది. మన అవసరం తనకు ఏమాత్రం లేకపోయినా (అపొ. కా 17:25) తన ప్రేమను మనతో పంచుకోవడానికి మనల్ని సృష్టించాడు. మానవాళికి కావలసిన సమ-స్తాన్ని సృష్టించి అందించడంలోనే ఆయన ప్రేమను వ్యక్తీకరించినా, ఆ ప్రేమ యొక్క పరిపూర్ణ వ్యక్తీకరణ సిలువ వైపు చూసిన వ్యక్తికే అర్థమౌతుంది.

తనకు ఏ ప్రయోజనం లేకపోయినా నిస్వార్థంగా మన మేలును కాంక్షించడంలో ఆయన మంచితనం వ్యక్తమౌతుంది. సృష్టిలోనిదేదీ కూడా దేవుని బాధించలేదు, ఆయన తనకు తానుగా మన బాధల్ని తనవిగా భావిస్తే తప్ప. న్యాయబద్ధంగా మనం దేవుని ఉగ్రతకు పాపాన్ని బట్టి అర్హులం. అయితే దానిని మనం అనుభవించకుండా చేయడంలోని దేవుని ప్రేమ యొక్క మరో స్వరూపమే ఆయన జాలి.

మన అర్హత, విలువల్ని బట్టి కాకుండా కేవలం తన మంచితనాన్ని బట్టి, తన దాతృత్వాన్ని బట్టి దేవుడు మనపట్ల వెల్లడిపరిచే అకారణ మహా ప్రేమనే కృప అంటారు. ఈ కృప మనం వేటికి అర్హులంకాదో వాటికి మనల్ని అర్హులుగా చేస్తుంది. ఉదా: దేవునితో సంబంధానికి, సహవాసానికి, ఆధ్యాత్మిక ఆశీర్వాదాలకు మనల్ని ఆయనకృప అర్హులుగా చేస్తుంది.

## 5. దేవుడు లోకానికి న్యాయాధిపతి (31వ)

ఈ ఒక్క వచనంలోనే పౌలు మూడు సత్యాలు చెప్పాడు.

- భూలోకానికి తీర్పు – మనుష్యులందరూ ఈ తీర్పులోనికి వస్తారు.
- ఒక దినము నిర్ణయించాడు – తీర్పు తప్పనిసరిగా ఉంటుంది.
- నీతిని అనుసరించిన తీర్పు – తీర్పు యొక్క స్వభావం: ఆయన స్వభావాన్ని అనుసరించి, పక్షపాత రహితంగా ఉంటుంది.
  - దేవుడు పరిశుద్ధుడు – లేవీ 19:2; హబ 1:13.
  - దేవుడు నీతిమంతుడు – కీర్తన 19:7-9; యిర్మీయా 9:24.
  - దేవుడు న్యాయవంతుడు – కీర్తన 89:14; 58:11.

దేవుడు నైతిక పరిపూర్ణత కలిగినవాడు, ఆయన ప్రేమ తత్వమే సర్వోన్నత నైతిక గుణ లక్షణం. దేవుడు పరిశుద్ధుడు అంటే 'అతీతుడు' అనే అర్థం ఉంది, అంటే నైతిక అపవిత్రత ఏమాత్రం దరికి చేరలేనంత అతీతుడు. అంతేకాదు సృష్టిలోని దేనితోనైనా ఆయనను పోల్చలేనంత అతీతుడని అర్థం.

దేవుడు తన స్వభావానికి భిన్నమైన ప్రణాళికలను కలిగిఉండడు, అలాంటి పనుల్ని చేయడు. ఆయన ఏమి చేసినా తన నైతిక పరిపూర్ణతకు అనుగుణంగానే చేసే గుణలక్షణాన్ని 'నీతి' అంటారు.

దేవుడు తన నైతిక పరిపూర్ణత ప్రమాణాల్ని తన సృష్టికి వర్తింపజేసి ఆశిస్తాడు. ఈ విషయంలో ఆయన ఏమాత్రం రాజీ ధోరణి వహించడు గనుక తన చట్టాన్ని దురభిమానం, పక్షపాతం లేకుండా అమలు చేస్తాడు. ఈ గుణలక్షణాన్ని 'దేవుని న్యాయం' అంటాము.

పరిశుద్ధత, నీతి, న్యాయం వంటి గుణలక్షణాలను కలిగి ఉన్నాడు కాబట్టే మన దేవుడు లోకానికి న్యాయాధిపతి అని, ఆయన ముందు మనమందరం తప్పక తీర్పుకోసం నిలబడవలసి వస్తుందని మర్చిపోకూడదు.

దేవునికి ఏమాత్రం అర్హంకాని, అయోగ్యమైన ఆలోచనలు ఆయన పట్ల కలిగి ఉండడమే విగ్రహారాధన యొక్క సారాంశం అన్నాడు టోజర్ భక్తుడు. అనంతుడైన దేవునిని ఆయన ప్రత్యక్షత వెలుగులో అర్థంచేసుకొనే చిరు ప్రయత్నమే ఈ వ్యాసం. ఈ ప్రయత్నం నిరంతరాయంగా మనందరి జీవితాల్లో జరిగినప్పుడు మన జీవితాలు ఆరాధనకు యోగ్యుడైన మన దేవుని స్వరూపంలోనికి మారడం తథ్యం!

– డి. అనిల్ కుమార్, వైజాగ్



# పర్‌పెచ్‌వా - ఫెలిసిటాస్

అది క్రీ.శ. 203 వ సంవత్సరము. పర్‌పెచ్‌వా ఉత్తర ఆఫ్రికాలోని కార్తేజ్ పట్టణములో (ఆధునిక తునీషియాలో ఉంది) నివసించేది. ఆమె ధనికురాలు, ప్రముఖమైన స్త్రీ, క్రైస్తవురాలు, యవ్వనస్తురాలు (22 సం॥రాలు), ఓ బిడ్డకు తల్లి, కాటక్యూమెన్స్ గుంపులో సభ్యురాలు. కాటక్యూమెన్స్ అంటే క్రైస్తవ్యం గూర్చి తర్ఫీదు పొంది, నేర్చుకొని, సంఘములో చేర్చబడేవారు. పెళ్ళయిన కొద్ది కాలానికే ఆమె భర్త ఆమెను విడిచి వెళ్ళిపోయాడు. అతను క్రైస్తవుడు కాదు. పర్‌పెచ్‌వా, ఆమె పనికత్తె అయిన ఫెలిసిటాస్‌లు చక్రవర్తిని దేవునిగా పూజించడానికి నిరాకరించిన కారణంగా అధికారులు అరెస్ట్ చేసి చెరసాలలో వేశారు. ముందున్న అధికారుల కన్నా ఇప్పుడున్న అధికారి క్రైస్తవుల పట్ల కొంత సహనం కనబరచినప్పటికీ స్థానికంగా చిత్ర హింసలు జరుగుతూనే ఉండేవి. చెరసాలలో ఉన్న పర్‌పెచ్‌వా, ఫెలిసిటాస్‌లు తీర్పు కోసం ఎదురుచూస్తూ ఉన్నారు.

పరపెచ్‌వా తండ్రి ఆమెను చూడడానికి వచ్చి జరగబోయే ప్రమాదం గూర్చి మాట్లాడుతూ క్రైస్తవ విశ్వాసం నుండి ఆమెను పక్కకు మళ్ళించే ప్రయత్నం చేశాడు. ఇంటికి వచ్చి బిడ్డను జాగ్రత్తగా చూసుకొమ్మని బతిమాలాడు. అయితే ఆమె ఒక కూజాను చూపించి దీనిని వేరే పేరుతో పిలవగలమా? లేదు కదా! అలాగే నేను కూడా పేరు మార్చుకోలేను. క్రైస్తవురాలిగానే పిలవబడతాను అన్నప్పుడు ఆయన కోపము ఆమె మీద రగులు కొన్నది. ఆమెకు హాని కలిగించాడు. పరిస్థితులను మరింత కఠినం చేయాలని శ్రమలు అధికమయ్యేలా చేశాడు. అయినా వీరిద్దరు చెరసాలలోనే బాప్తీస్మం పొందారు.

వీరిరువురికి ఉన్న అతికష్టమైన సంగతి ఏంటంటే, ఫెలిసిటాస్ గర్భిణీ స్త్రీ, పర్‌పెచ్‌వా పాలిచ్చే తల్లి (చంటి బిడ్డ). పర్‌పెచ్‌వా ఆమె తల్లిని, తమ్ముడిని శిశువును చూసుకోమని బతిమాలింది కానీ ప్రయోజనం శూన్యం. తన బిడ్డకి తల్లి సంరక్షణ తప్పనిసరి కానీ చెరసాల అధికారులు బిడ్డను అనుమతించలేదు. కొన్ని దినాలకు మరొక చెరసాలకు తరలించి, అక్కడ ఇరుకైన ఓ చీకటిగదిలో ఉంచారు.

ఒక రోజు తలుపు తెరిచి ఎక్కువ వెలుతురు, తాజా గాలి వచ్చే మరో గదికి పర్‌పెచ్‌వాను తరలించారు. అక్కడ అకస్మాత్తుగా తన తల్లిని చూసింది. ఆమె కూడా క్రైస్తవురాలే. పర్‌పెచ్‌వా తన శిశువుని చూసుకోవడానికి అనుమతించారు. బిడ్డకు పాలిచ్చి పోషించగలిగింది. ఆమె సోదరుడు నీవు బంధించబడడంలో దేవుని ఉద్దేశమేంటో తెలుసుకో అని అడిగాడు. ప్రార్థించి రేపు జవాబు చెప్తాను అని చెప్పింది. ఆ రాత్రి ఆమె ప్రార్థిస్తూ ఉండగా, దర్శనంలో ఓ పొడవైన బంగారు నిచ్చెన కింద నుండి పరలోకాన్ని తాకుతుండడం చూసింది. అది చాలా అందంగా ఉంది గానీ దానికి పక్కవైపు, కత్తులు, ఈటెలు, బళ్ళెములు, ఖడ్గాలు తగిలించి ఉన్నాయి. దానిని నిర్లక్ష్యంగా ఎక్కితే ప్రమాదమే. నిచ్చెన ఎక్కే వారిని కబళించడానికి, క్రింద ఖడ్గ మృగము ఉంది. పర్‌పెచ్‌వా నిచ్చెన దగ్గరకు రాగానే ఖడ్గమృగం

తన తలను పైకెత్తింది గానీ ఆమె భయపడకుండా మృగము తలపై కాలుపెట్టి నిచ్చెనెక్కి పైకెళ్ళింది. ఎంతో అందమైన తోటలోకి చేరుకొంది. అక్కడ ఓ గొర్రెల కాపరి కూర్చొని ఉన్నాడు. గొర్రెల కాపరి పర్‌పెచ్‌వా వైపు చూసి కుమారీ నీకు స్వాగతం అన్నాడు. ఓ జున్ను ముక్క కూడా ఇచ్చాడు, దానిని ఆమె తిన్నది. తర్వాత మెలుకువ వచ్చింది. ఈ విషయాన్ని తన సహోదరునితో చెప్పినప్పుడు, తన సోదరి హతసాక్షిగా మరణిస్తుందని అర్థమైంది.

అందరూ చూసేటట్లు క్రైస్తవులను సంత వీధులలో నిలబెట్టే వారు. అప్పుడు వారిని ప్రోకన్సల్ (మెజిస్ట్రేట్) ప్రశ్నిస్తాడు. ఈ వార్త పర్‌పెచ్‌వా తండ్రి విని పరుగెత్తుకుంటూ వెళ్ళి అక్కడికి చేరుకొని తన విశ్వాసాన్ని విడిచిపెట్టమని మరోసారి బతిమాలాడు. తన కుమారుడిని, నెరసిన తన తలవెంట్రుకలను చూపించి, ఆమె చేతి మీద ముద్దు పెట్టి, నేల మీద పడి ఏడ్చాడు. పర్‌పెచ్‌వా కూడా ఏడ్చింది, కానీ ఆమె క్రైస్తవురాలిగా చనిపోతున్నందుకు కాదు. ఆమె తండ్రి ఆమె క్రైస్తవురాలైనందుకు హర్షించి ప్రోత్సహించలేదు సరికదా విశ్వాసాన్ని విడిచి రమ్మంటున్నందుకు బాధపడింది. కానీ, తన విశ్వాసాన్ని విడనాడడానికి పర్‌పెచ్‌వా నిరాకరించింది. పర్‌పెచ్‌వాను ప్రశ్నించే సమయం వచ్చింది. అప్పుడు తన తండ్రి శిశువును పట్టుకొని పరిగెత్తుతూ ముందుకు వచ్చి "నీ బిడ్డపై కరుణ చూపించు" అని బిగ్గరగా కేక వేశాడు. తన బిడ్డను పర్‌పెచ్‌వా ఎంతో ప్రియముగా ప్రేమించినా, తన ప్రభువైన రాజు పట్ల అత్యధిక ప్రేమను కనబరచింది.

అక్కడున్న అధికారి రాజు గారి క్షేమం నిమిత్తం, చక్రవర్తికి బలులు అర్పించాలి. ఆయనే నీ ప్రభువు, యజమానుడని ఒప్పుకుంటే నిన్ను విడుదల చేస్తాం అని చెప్పినప్పుడు "నేను క్రైస్తవురాలిని. నా దేవుడే నా యజమాని, నా ప్రభువు" అని చెప్పింది. అప్పుడు ఆ అధికారి కోపంతో పర్‌పెచ్‌వా తండ్రిని ఇనుప చువ్వలతో కొట్టమని ఆదేశించాడు. ఆ ఆజ్ఞను అమలు పరచడం చూసి ఆమె భయపడింది. తరువాత తన బిడ్డను తనతో ఉంచమని బతిమాలినప్పుడు, ఆమె తండ్రి నిరాకరించాడు. ఆమెను మరలా చీకటి గదిలోకి తీసుకెళ్ళారు. అప్పటికి తన బిడ్డ పాలు విడిచాడు కాబట్టి కొంత ఉపశమనం పొందింది.

ఆ బంధకంలో ఉన్న క్రైస్తవులందరూ చివరి దినాలను ఉపయోగకరంగా మార్చుకొంటున్నారు. పర్‌పెచ్‌వా కూడా ఖైదీలుగా ఉన్నవారి ఉదంతాలను డైరీలో రాసింది. ఆ డైరీ తరువాత తరాన్ని ప్రోత్సహించడానికి, ధైర్యపరచడానికి ఉపయోగపడింది. జైలు అధికారియైన ప్యూడెన్స్ మరణకరమైన హింసల్లో కూడా వారు కలిగి ఉన్న ధైర్యాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. తోటి క్రైస్తవులు వారిని కలవడానికి అనుమతించాడు. వారి మాటలు వీరిని ధైర్యపరిచాయి. పర్‌పెచ్‌వా తండ్రి మరలా వచ్చాడు. తన కుమార్తె కొరకై దు:ఖంతో తన గడ్డాన్ని పెరికి పారేసి, నేల మీద పడి ఏడ్చాడు. అప్పుడు పర్‌పెచ్‌వా తనను తాను రక్షించుకోవడానికి బదులు, తన తండ్రి కోసం ఏడ్చింది. ఈ విషయం తండ్రికి ఆశ్చర్యం కలిగించింది.

ఫెలిసిటాస్ 8 నెలల గర్భిణిగా ఉంది. కాబట్టి, క్రూరమృగాలచే చంపబడడానికి అధికారులు నిరాకరించారు. చట్టపరంగా గర్భిణీ స్త్రీలను చంపడం నేరం. ఈ వార్త విని, సంతోషించడానికి బదులు హతసాక్షుల జాబితాలో నేను చేరలేక పోతున్నానని ఫెలిసిటాస్ బాధపడింది.

చనిపోవడానికి ముందు ఫెలిసిటాస్ మిగిలిన ఖైదీలు ప్రార్థనకై కూడుకొన్నారు. ఒంటరిగా ఈ శిక్షను అనుభవించకుండా తన సహోదరులతో పాటు, క్రూర మరణాన్ని ఎదుర్కొనే భాగ్యమివ్వమని ప్రార్థించింది. వెంటనే ఆమెకు ప్రసవవేదన (పురిటి నొప్పులు) మొదలయ్యింది. ప్రసవవేదన ఎంతో కఠినంగా, భారంగా మారింది. అప్పుడు మంత్రసాని "ఇప్పుడే ఇంత బాధపడుతున్నావు, క్రూర మృగాల ముందు వేసినప్పుడు ఏం చేస్తావు?" అని అడిగింది. అప్పుడామె, "ఇప్పటిలాగే శ్రమ పడతాను కానీ, అప్పుడు నా దేవుడు నాతో కూడా ఉంటాడు" అని చెప్పింది. ఆమె చక్కటి కుమార్తెకు జన్మనిచ్చి, ఆ బిడ్డ పెంపకాన్ని ఓ క్రైస్తవురాలికి అప్పగించింది.

చివరికి, చక్రవర్తి జన్మదినం రానే వచ్చింది. పర్‌పెచ్‌వా, ఫెలిసిటాస్‌కి మరణ దినము సమీపమైంది. క్రైస్తవులందరూ రంగ స్థలానికి తీసుకురాబడ్డారు. వీరంతా తమ హృదయంలో ఎంతో సంతోషంతో నడిచి వెళ్ళారు. యవ్వన పురుషులు ముందు నడవగా, యవ్వన స్త్రీలు వారి వెనక నడిచారు. ప్రత్యేకించి పర్‌పెచ్‌వా,



ఫెలిసిటాస్ (పనికత్తె) సొంత అక్కాచెల్లెళ్ళ వలె పక్కపక్కనే నడిచారు. నాటరన్ సిరిస్‌ల యొక్క వస్త్రాలు ధరించమని అడిగినప్పుడు క్రైస్తవులు నిరాకరించారు. అది గమనించిన అధికారులు సొంత దుస్తులకు అనుమతించారు. క్రైస్తవులు అధికారి ముందు నుండి వెళ్తున్నప్పుడు "నీవు మాకు తీర్పు తీరుస్తున్నావు. దేవుడు నీకు తీర్పు తీరుస్తాడు" అని అరిచారు. దీన్ని బట్టి వారిని క్రూరమృగాలకు వదలకముందే, కఠినంగా శిక్షించారు. పర్‌పెచ్‌వా, ఫెలిసిటాస్ ఒకేసారి మైదానంలో ప్రవేశించాలి అని చెప్పినప్పుడు, ఫెలిసిటాస్ దేవుని స్తుతించింది. దేవుడు తన ప్రార్థనను అంగీకరించి హతసాక్షుల జాబితాలో చేర్చబోతున్నందుకు హర్షించింది.

ఇద్దరు తల్లుల వస్త్రాలను తీసేసి దిగంబరులుగా చేసి కప్పుకోడానికి వలలు ఇచ్చారు. తర్వాత ఒక క్రూరమైన ఎద్దును వదిలారు. ఎద్దు వారిని తొక్కుతూ, ఈడుస్తుంది. పర్‌పెచ్‌వా ఎద్దును పట్టించుకోకుండా, తన జుట్టును సవరించుకొంటుంది. ఆ మరణాన్ని అంతగా గౌరవించింది. అలా గాయపరచబడి నేల కొరిగింది. ఫెలిసిటాస్ ఎద్దుచే, ఈడ్వబడుతూ ఉంది. పర్‌పెచ్‌వా వచ్చి ఫెలిసిటాస్‌ను లేవనెత్తింది. ఒకరి నొకరు హత్తుకొని మరో దాడికి ఎదురు చూస్తున్నారు. మరలా ఎద్దును వదిలారు.

ఈవిధంగా క్రూర మృగాలతో, క్రూరంగా శిక్షించబడిన తర్వాత కత్తితో పొడవబడి చంపబడ్డారు. ఒక నూతన యోధుడు పర్‌పెచ్‌వాను ప్రక్కటెముకల మధ్య పొడిచినప్పుడు, పెద్దగా అరుస్తూ నేల కొరిగింది. ప్రాణం పోయే వరకు విశ్వాసం నుండి పక్కకు మరలలేదు. మరోసారి వీరిరువురు రక్షకుడిని ఘనపరిచారు. వారి ప్రభువే వారి యజమానుడు, చక్రవర్తి వారి యజమానుడు కాదని చెప్పడానికి వారి ప్రాణాలను పణంగా పెట్టారు.

**– మార్త కొండలరావు,** బొల్లాపల్లి




# ప్రార్థిద్దాం

1. మనదేశంలో 98.88 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వారందరూ ఓటు హక్కును వినియోగించుకొనేటట్లు
2. లోక్‌సభకు 543 మంది నాయకులను ఎన్నుకోబోతున్నాము, దేవుని చిత్తంలో ఉన్నవారు ఎంపిక అయ్యేటట్లు
3. 7 దశలలో జరగబోయే ఎన్నికలు శాంతియుతంగా జరగాలని, ఎటువంటి అల్లర్లు, హింసలకు తావులేకుండేటట్లు
4. పోలింగ్ బూత్‌లో ఎన్నికల సిబ్బంది భద్రత, ప్రయాణాల కొరకు, రిగ్గింగ్ జరగకుండా ఉండేటట్లు
5. ఓటర్లు డబ్బులకు అమ్ముడు పోకుండా, ప్రలోభాలకు లొంగకుండా నీతిగా, న్యాయంగా ఓట్లు వేసేటట్లు
6. ఎన్నికల సిబ్బందికి ప్రజలు సహకరించేటట్లు, ఈవియం మిషన్స్ చక్కగా పని చేసేటట్లు
7. ఎన్నికల కమీషనర్ వారి బృందం, రూట్ ఆఫీసర్స్, పివో, ఏపివో, పోలీస్ వారి కొరకు, రెవెన్యూ అధికారుల కొరకు
8. 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలలో ఎన్నికలు సజావుగా జరిగేటట్లు
9. ఓట్ల లెక్కింపు ప్రక్రియ న్యాయంగా, ఎలాంటి అక్రమాలు లేకుండా జరిగేటట్లు
10. దేవుని చిత్తంలో ఉన్న ప్రభుత్వాలు వచ్చేటట్లు, రానున్న దినాలలో సువార్తకు ఆటంకం లేకుండునట్లు, కుల, మత వైషమ్యాలు లేని పాలన, మత స్వేచ్ఛను ఆటంకపరచని నాయకులు వచ్చేటట్లు, ప్రజాస్వామ్య పరిరక్షణ కొరకు, అవినీతి, అక్రమ, లంచగొండితనం దేశం నుండి నిర్మూలించబడేటట్లు ప్రార్థించండి.

**– బి. రవి కుమార్,** కారంపూడి

ఫ్యామిలీ

# మెటీరియలిజం

*"యాపిల్, బ్లాక్‌బెర్రీలు కేవలం పండ్లుగా ఉన్నప్పుడే జీవితం చాలా తృప్తిగా ఉండేది"*

ప్రస్తుతం ఇది ప్రపంచ వ్యాప్తంగా మానవ సమాజాన్ని వేధిస్తున్న ఒక పెద్ద సమస్య. మెటీరియలిజం అంటే మనకు వస్తుసంపద మీద ఉన్న విపరీతమైన వ్యామోహంగా చెప్పవచ్చు. మెటీరియలిజం అనేది శతాబ్దాలుగా ఉన్న ఒక తాత్విక భావన. కానీ పారిశ్రామికీకరణ, ప్రపంచీకరణల వల్ల అది నేటి సమాజంలో ఎక్కువ ప్రబలంగా మారింది. సరళంగా చెప్పాలంటే మెటీరియలిజం అనేది సంపదను, ఆస్తులను లేదా వస్తువులను పోగేస్తూ, జీవితంలోని ఇతర అంశాలను తరచుగా నిర్లక్ష్యం చేయడమే. ఒకసారి మన ఇంటిలోని వస్తువులను ఊహించుకొండి - అవి బట్టలు, ఫోన్, కారు, బంగారం లేక ఏదైనా అవ్వచ్చు. అందులో కొన్ని మనకు చాలా అవసరమైనవి ఉంటాయి. కొన్ని అవసరం లేనివి ఉంటాయి. ఇంకొన్ని మనకు చాలా ఇష్టమైనవి ఉంటాయి. అయితే సమస్య ఏంటంటే కొందరికి ఎన్ని వస్తువులు ఉన్నా వాటితో తృప్తి చెందక ఇంకా ఎక్కువ వస్తువులను కోరుకొంటారు. ప్రకటనలు, డిస్కౌంట్స్, ఇతరులతో పోల్చుకోవడం మనకి మరింత కొనుగోలు చేయాలన్న భావాన్ని సృష్టిస్తాయి. ఆన్లైన్ షాపింగ్ వచ్చిన తర్వాత వస్తువులను కొనడం అనేది ఇంకా సులభమైంది.

## భౌతికవాదం (మెటీరియలిజం) నిర్వచనం

మెటీరియలిజం అనేది భౌతికవాదానికి దగ్గరి సంబంధం కలిగి ఉంటుంది, ఇది సృష్టిలో ఉన్నదంతా కేవలం కంటికి కనిపించే భౌతిక పదార్థ సంబంధమైన వస్తువులు మాత్రమే అంటుంది.

ఆర్థిక, భౌతికవాదం అనేది భౌతికపరమైన వస్తు వులను సంపాదించడం. తినుము త్రాగుము అనే అధికమైన కోరికను కలిగి ఉండటం, భౌతిక సంపదను కొనుగోలు చేయడం, ఖర్చుచేయడం, పోగుచేయడం ద్వారా పెంచవచ్చు. ఆనందం అనేది తాను సమాజంలో కలిగివున్న భౌతిక సంపద మీద ఆధారపడి ఉంటుంది అని భావించడం.




సంపద మాత్రమే సమాజంలో వారికి గుర్తింపు గౌరవం ఇస్తుంది అనేది వారి నమ్మకం. కనుక దాన్ని పొందడం, దాన్ని కాపాడుకోవడం కోసం వారు ప్రయత్నిస్తుంటారు. మెటీరియలిజంను ప్రేమించే వారికి మనుషుల కంటే సంపదే ముఖ్యం. కనుక వీరిలో ఒంటరితనం, ఆందోళన, నిరాశ, అసూయ, విచ్ఛిన్నమైన సంబంధాలను మనం గమనించ వచ్చు.

## మెటీరియలిజం వల్ల జరిగే నష్టాలు

పెద్ద పెద్ద కంపెనీలు మార్కెటింగ్ వ్యవస్థలకు వారి లాభాలు, సంపదే ముఖ్యం. వారు మెటీరియల్స్‌ని, ఆయిల్, ఖనిజాలు వెలికితీసే సమయంలో, బల్క్ ప్రాసెసింగ్ వల్ల పర్యావరణానికి జరిగే నష్టాన్ని ఏ మాత్రం ఆలోచించరు. అలానే ఎరువులు తయారీలలో వెలువడే విష వాయువులు, వ్యర్థాలతో సంభవించే సామాజిక విపత్తులు వారు లెక్క చేయరు. ఎందుకంటే వారి ఎదుగుదలే వారికి ముఖ్యం. పెద్ద పెద్ద పనులు చేస్తున్నప్పుడు ఇటువంటి విపత్తులు వారి దృష్టికి చాలా చిన్నవి అని భావిస్తారు. ఇవి సహజం సర్వ సాధారణం అంటారు.

- ప్రతి సంవత్సరం 9 మిలియన్ హెక్టార్ల అడవులు కోల్పోతున్నాము.
- 100 మిలియన్ హెక్టార్ల సహజ ఆవాసాలు ఏటా నాశనం అవుతున్నాయి.
- గత శతాబ్దంలో 50% చిత్తడి భూములు కోల్పోయాము.
- ప్రతిరోజు ఆకలితో 20,000 మంది, పేదరికం కారణంగా సంవత్సరానికి 8 మిలియన్ల మంది మరణిస్తున్నారు.

❖ 50% జంతువులు, మొక్కలు వేట, చేపలు పట్టడం ప్రజల భోగభాగ్యాల వల్ల అంతరించి పోయాయి.

❖ చమురు వాయువు, లోహాల క్షీణత.

❖ గ్లోబల్ వార్మింగ్, పోలార్ క్యాప్స్ కరగడం, వరదలు, ఓజోన్ పొర పలుచబడడం.

❖ వాయు కాలుష్యం వల్ల భారతదేశంలో సంవత్సరానికి అనేక మంది చనిపోతున్నారు.

## బైబిల్లో మెటీరియలిజం

ఆదికాండం1-2 అధ్యాయాలు గమనిస్తే దేవుని సృష్టి ఎంతో అందమైనది, మంచిది. మానవుడ్ని తన సృష్టికి అధికారిగా చేసి ఈ భూమిని నిండించి అభివృద్ధి చెందమని దేవుడు మానవునికి ఆజ్ఞాపించాడు. మనిషి మెటీరియలిస్టిక్ మనసుతో జీవిస్తూ, వస్తు సంపదను ప్రేమిస్తూ దేవుని సృష్టిని పాడుచేస్తున్నాడు.

ఆది 3:6 - ఆదాము హవ్వలు పండు తిన్నారు (నేత్రాశ శరీరాశ జీవపుడంబం). ఆది 4:3 - దేవుని యెదుట కయీను లోభత్వముగల అర్పణ. ఆది 4:17- కయీను దేవుని సన్నిధి నుండి బయలుదేరి తన కుమారుని పేరు మీద ఒక పట్టణాన్ని నిర్మించాడు. ఆది 11 - దేవుడు లేని బాబెల్ గోపురం. ఆది 13:10 - అబ్రాహాము వాగ్దాన దేశంలో అపరిచితుడిగా జీవిస్తున్నప్పుడు లోతు సొదొమను ఎన్నుకొన్నాడు. ఆది 25:29-34 - ఏశావు వంటకం కోసం తన జ్యేష్ఠత్వము అమ్ముకొన్నాడు. ఆది 37 - యోసేపు యొక్క రంగుల అంగీ అతని సోదరులలో అసూయను తెచ్చింది. యెహో 7:1 - ఆకాను దురాశ పాపం. 1 రాజులు 21 - అహాబు నాబోతు ద్రాక్షతోటను ఆశించి అతనిని చంపాడు. 2 రాజులు 5:25 - డబ్బు, బట్టలు, ఒలీవ తోటలు, ద్రాక్షతోటలు, మందలు తీసుకోవడానికి ఇదే సమయమా? ప్రసంగి 5:10 - డబ్బును ప్రేమించేవాడు డబ్బుతో సంతృప్తి చెందడు. ప్రసంగి 5:13 - ఐశ్వర్యములను వాటి యజమాని తనకి హాని చేయుటకు ఉంచుకొనెను. ఆమోసు 6:4 - ఏనుగు దంతాలు పొదిగిన మంచాలపై మీరు పడుకుంటారు. మత్తయి 6:24 - మీరు దేవునిని, డబ్బును సేవించలేరు. మార్కు 10:23 - ఐశ్వర్యం ఉన్నవారు దేవుని రాజ్యంలో ప్రవేశించడం ఎంతో దుర్లభము. లూకా 12:33 - నీ ధనం ఎక్కడ ఉందో అక్కడ నీ హృదయం ఉంటుంది. 1 తిమో 3:3 - అధ్యక్షపదవిని ఆశించినయెడలవారు డబ్బు ప్రేమికులు కాకూడదు. హెబ్రీ 13:5 - మీకున్న దానితో సంతృప్తి చెందండి.

## ప్రాస్పారిటీ గాస్పల్ ప్రభావం

ప్రాస్పారిటీ గాస్పల్ ఇప్పటికే క్రైస్తవ్యాన్ని అల్లకల్లోలం చేస్తుంది. వారు “ఐశ్వర్యం మీ హక్కు”, మీ కలను వెంబడించండి. శాంతి, ఆరోగ్యం, ఆనందం, శ్రేయస్సు, డబ్బు, సంపద ఇవన్నీ దేవుని సంకల్పం.” మీరు ఇప్పుడు అన్నిటినీ కలిగి ఉంటారు” ఇవి వారి నినాదాలు. ప్రాస్పారిటీ బోధకులు పర్స్ లపై (జేబులపై) దాడి చేస్తున్నారు. వీరి బోధల వల్ల ప్రజలు ఆధ్యాత్మిక జీవితాల నుంచి తొలగిపోయి మెటీరియలిజం వైపు నడుస్తున్నారు.

## మన బాధ్యతేమిటి?

యుఇయస్ఐ గ్రాడ్యుయేట్‌గా, విద్యార్థిగా మనం యేసు క్రీస్తు వలె సింపుల్ లైఫ్ స్టైల్ కలిగి జీవించాలి అని ఇనాక్ గారు, స్టెరెట్ గారు వంటి మన పెద్దలు నేర్పించారు, వారు అలానే జీవించారు. వారి సమయాన్ని, ధనాన్ని మిగిల్చి వాటిని దేవునికి, విద్యార్థులకు ఇచ్చారు. అందువలననే వారు కొద్దికాలంలోనే యుఇయస్ఐ ఉద్యమం ద్వారా భారతదేశంలో ఎన్నో కళాశాలలను, విద్యార్థులను క్రీస్తు కొరకు గెలిచారు. కానీ నేడు మన సహవాసంలో అనేకులు ఈ మెటీరియలిజం వలలో చిక్కుకొని లోక మర్యాదలను అనుసరిస్తున్నారు. బ్రతకడానికి దేవుడు వారికి ఇచ్చిన ఉద్యోగాలతో తృప్తి చెందలేక రకరకాల వ్యాపారాలు చేస్తున్నారు. పరిచర్యకు విద్యార్థులకు సమయాన్ని ఇవ్వలేకపోతున్నారు. వారి మనసులు ఆత్మల సంపాదన నుండి తొలిగిపోయి భూసంబంధమైన వస్తు సంపద వైపు అనగా డబ్బు, భూములు, వెండి బంగారాలు, వెలగల వస్త్రాలు, విలాసవంతమైన గృహాలు, కార్లు, గాడ్జెట్ల వైపు వెళ్ళిపోతున్నాయి. అందుకే విద్యార్థులను గెలుచుకోవడంలో మనం వెనకబడిపోతున్నాం. ఇప్పటికైనా మనం మేల్కొని వస్తు సంపదపై వ్యామోహం తగ్గించుకొని క్రీస్తు మాదిరిని అనుసరిస్తూ పరిచర్యలో కొనసాగుదాం.

**- ఆదం,** చింతలపూడి

బైబిల్ స్టడీ



# రాజు ఎలా ఉండాలి?

(ద్వితీ 17:14-22)

"ఒక వ్యక్తి గురించి నిజంగా మనం తెలుసుకోవాలంటే ఆ వ్యక్తికి నాయకత్వం, అధికారం ఇచ్చి చూడు" అని అబ్రహం లింకన్ అన్నట్టుగా ఒక వ్యక్తి యొక్క నిజస్వరూపం, వ్యక్తిత్వం అతడు నాయకుడు లేక అధికారి అయినప్పుడే అర్థమవుతుంది. రాజుగా ఉండబోయే వ్యక్తి ధర్మశాస్త్రం పట్ల, దేవుని మీద ఆధారపడే విషయంలో ఎప్పుడూ మారని నిబద్ధత కలిగి ఉండాలని ఈ వాక్యభాగం చెబుతుంది.

## నేపథ్యం

ద్వితీయోపదేశకాండానికి హెబ్రీ భాషలో "ఇవే దేవుడు చెప్పిన మాటలు" అనే అర్థం వచ్చేలా ఈ గ్రంథానికి టైటిల్ తోరాలో ఉంటుంది. ముఖ్యంగా మోషే దేవుడు చెప్పిన ధర్మశాస్త్రాన్ని లేక విధి విధానాలను ఈ గ్రంథంలో వివరిస్తాడు. మోషే జీవితంలో చివరివారాలలో జరిగిన సంగతులు ఈ గ్రంథంలో మనం చూస్తాం. ఎక్కువ భాగం ధర్మశాస్త్రాన్ని మోషే ఇశ్రాయేలీయులకు వివరించడం ఉంటుంది. దానితో పాటు దేవుని మాటలు గ్రంథస్తం చేయడం, యెహోషువకు నాయకత్వం అప్పగించడం, వాగ్దాన దేశాన్ని మోషే కొండ మీద నుంచి చూడడం, మోషే మరణం ఉన్నాయి.

దేవుడు చేసిన నిబంధన మోషే కొనసాగించాలంటే ప్రజలు పాటించాల్సిన విధివిధానాలు చెబుతూ, భవిష్యత్‌లో వాళ్ళు రాజును కోరుకొంటే ఆ రాజు ఎలా ఉండాలో ఇక్కడ వివరిస్తున్నాడు. కేవలం ద్వితీయోపదేశకాండంలోనే మనం రాజుకు సంబంధించిన నిబంధనలు చూస్తాం. 16-18 అధ్యాయాలలో నాయకులు గురించిన సంగతులు ఉన్నాయి. ఈ వాక్య భాగంలో నుంచి నాయకులుగా దేవుడు మన దగ్గర నుంచి ఏమి కోరుకొంటున్నాడు? ఎలా ఉండాలని ఆశిస్తున్నాడు? అన్న విషయాలు మనం నేర్చుకోవచ్చు. రాజుగా ఉండడానికి రెండు అర్హతలు, మూడు పరిమితులు ఇక్కడ మనం చూస్తాం. అన్యుడు కాని వాడు, దేవుని చేత ఎన్నుకోబడిన వాడు రాజుగా ఉండాలి. ఆ రాజు విస్తారమైన గుర్రాలు, ఎక్కువ మంది భార్యలు, ఎక్కువ సంపద కలిగి ఉండకూడదని దేవుడు పరిమితిని చూపించాడు. అన్నిటికంటే ముఖ్యంగా దేవుని ధర్మశాస్త్రాన్ని పూర్ణ హృదయంతో పాటించే వ్యక్తిగా ఉండాలని దేవుడు కోరుకుంటున్నాడు.

## బైబిల్ స్టడీ చర్చకు ప్రశ్నలు

1. దేవుని ప్రజల మీద నాయకుడిగా, రాజుగా ఉండే వ్యక్తికి ఉండాల్సిన లక్షణాలు, పరిమితులు (ఏవి చేయకూడదు) ఏంటి?
2. నాయకుడు (రాజు) దేవుని చేత ఎందుకు ఏర్పరచబడాలి? లేకపోతే ఏమవుతుంది?
3. సంఘంలో లేక సహవాసంలో అన్యుడిని ఎందుకు నాయకుడిగా దేవుడు అనుమతించట్లేదు?
4. సహవాసంలో(సంఘంలో) ఏ విధంగా అన్యులు చొరబడి, నాయకులయ్యే అవకాశాలు ఉంటాయి? ఏ యే విషయాలలో మనం జాగ్రత్త వహించాలి?
5. గుర్రాలు, భార్యలు, సంపద విషయంలో దేవుడు ఎందుకు పరిమితిని విధిస్తున్నాడు? అవి విస్తరించడం ద్వారా వచ్చే నష్టాలు ఏంటి?
6. ప్రస్తుత మన పరిచర్యలో సంపూర్ణంగా దేవుని మీద విశ్వాసం ఉంచకుండా ఏ యే విషయాలను బట్టి మనం ధైర్యం తెచ్చుకొంటున్నాం? గర్విస్తున్నాం?
7. రాజుగా సింహాసనం ఎక్కిన తర్వాత ధర్మశాస్త్ర విషయంలో ఎందుకు ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలి? దాని ద్వారా వచ్చే ఆశీర్వాదాలు ఏంటి?
8. నాయకుల జీవితాలలో దేవుని వాక్యం ఎలాంటి పాత్ర పోషించాలి అని దేవుడు కోరుకొంటున్నాడు? ఎందుకు?
9. మనం దేవుని చిత్తంలోనే నాయకులం అయ్యాము అనే నిశ్చయత ఉందా? ఆ నిశ్చయత మనకి ఏ విధంగా ఉపయోగపడుతుంది?
10. విద్యార్థులకు వాక్యం నేర్పించే నాయకులుగా వాక్యాన్ని మనం ఎంత నిబద్ధతతో చదువుతున్నాం? పాటిస్తున్నాం?

- ఏ. శివరామ కృష్ణ , స్టాఫ్, పిడుగురాళ్ళ






# క్రీస్తును ఒంటరిగా వెంబడించలేను...

వేలడిక్టరీ ఫంక్షన్ రానే వచ్చింది. రిపోర్టులు, విశ్లేషణలు జరిగిపోయాయి. అన్న వాళ్ళు వచ్చే సంవత్సర కార్యక్రమాల గురించి చాలా మాట్లాడారు. చేయవలసినంత చేయలేకపోయాం గానీ వెనక ఉన్నవి మరచి ముందున్న వాటి కొరకు త్వరపడి పని చేద్దామని తీర్మానించుకొన్నారు. చివర్లో, వచ్చే సంవత్సరానికి ఇయు కమిటీని ప్రకటన చేయడానికి సంపూర్ణరావు అన్న ముందుకు వచ్చాడు. అన్న వచ్చే సంవత్సరానికి సీనియర్ అడ్వైజర్‌గా నియమించబడ్డాడు. తనతో కూడా వచ్చే సంవత్సరం పని చేయడానికి మంచి విద్యార్థుల టీమ్‌ని నిర్ణయించారు. అందరూ ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ ఇలా పేర్లు చదువుతుంటే అందరూ చప్పట్లు కొడుతున్నారు. ప్రేయర్ సెక్రటరీ శేఖర్ అనగానే శేఖర్ లేచి వెళ్ళాడు. అందరూ చప్పట్లు కొడుతుండగా శేఖర్ మనసులో ఎన్నో ఆలోచనలు...

అంతకు ముందు ప్రార్థన చేసుకొని నీ నిర్ణయం చెప్పు అని సీనియర్ అడ్వైజర్ అన్న చెప్పగానే భయం వేసింది గానీ అన్న మాట తీసివేయలేక అలాగే అని తర్వాత కమిటీలో ఉండడానికి తన అంగీకారాన్ని తెలిపాడు. ఈ రోజు పేరు పిలవగానే ఏదో భయం, అదే సమయంలో ఏదో అతిశయం కూడా. సంపూర్ణరావు అన్న పేరు పిలిచి వచ్చే సంవత్సరం పరిచర్యకు కావలసిన శక్తినంతా అందించే వ్యక్తి అని సంబోధించేటప్పటికి ఎక్కడలేని సంతోషం కలిగింది. ఆ రోజు మెసేజ్ అంతా ప్రార్థన మీదే. మన ఇయులలో ప్రార్థన లోపం గురించి మోకాళ్ళు అరగని గ్రాడ్యుయేట్స్ గురించి తీవ్రంగా మాట్లాడాడు గెస్ట్ స్పీకర్. దేవుని సహాయం కోసం అర్థించడం, నామమాత్రమైన ఇయు, ఇజియఫ్‌ల బండారం బయటపెట్టి పెద్ద పెద్ద ఉజ్జీవాల వెనుక ప్రవహించిన కన్నీటి ప్రార్థన గురించి ఆయన చెప్తుంటే శేఖర్ శరీరంలోంచి విద్యుత్ ప్రవహించినట్లు అనిపించింది. దేవా నేను కూడా అలా ప్రార్థించి నా ఇయులో గొప్ప ఉజ్జీవం తేవాలి అని నిశ్శబ్దంగా ప్రార్థించుకొన్నాడు. మీటింగ్ అయిపోయింది, రెండు నెలల్లో పరీక్షలు అయిపోయి సెలవులకు ఇళ్ళకు వెళ్ళేందుకు స్టూడెంట్స్ సిద్ధపడుతున్నారు. సంపూర్ణరావు అన్న కొత్త కమిటీ మెంబర్స్ ఫోన్ నంబర్స్ తీసుకున్నాడు. సెలవుల్లో జాగ్రత్త. ఫెలోషిప్ ఉండదు కాబట్టి సాతానుడు దొంగదెబ్బ కొడతాడు. అప్పుడప్పుడు నేను ఫోన్ చేసి మాట్లాడతాను. మీ ఆత్మీయ జీవితం మీదే ఇయు పరిచర్య వ్యక్తుల ఆత్మీయత ఆధారపడి ఉంటాయి.

కాబట్టి మిమ్మలను జాగ్రత్తగా కాపాడుకోవాలి అని చెప్పి, శేఖర్ నీకు డి.యల్ మూడీ గారు ప్రార్థన మీద రాసిన పుస్తకం ఇస్తాను. తెలుగులోనే ఉంది. అది తప్పక చదువు. ఈ సెలవులలో నీకు చాలా సహాయం చేస్తుంది అని హెచ్చరిస్తూ పంపించాడు.

శేఖర్ పాలిటెక్నిక్ రెండో సంవత్సరం చదువు తున్నాడు. ప్రభువును రక్షకునిగా అంగీకరించి రెండు సంవత్సరాలు అయింది. ఇయులో బాగానే ఎదిగాడు. హైదరాబాద్ నగరంలో గచ్చిబౌలి జోన్‌లో ఇయు ఫెలోషిప్ బాగా ఉంటుంది. కరీంనగర్ జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో ఉన్న తల్లిదండ్రులకు దూరంగా నగరంలోని విశ్వాసుల మధ్య శేఖర్ అనుభవించిన వాతావరణం చాలా భిన్నంగా ఉంది. ఇప్పుడు తన స్వగ్రామంలోకి సెలవులకు వెళ్ళిన శేఖర్‌కు ఇక్కడి వాతావరణం గొప్ప సవాలుగా మారింది. అమ్మ నాన్నలు అవిశ్వాసులు, బంధువులు నామకార్ధ క్రైస్తవులు. గుడికి వెళ్ళడం కేవలం ఒక ఆచారం.

శేఖర్ నీకోసం రాజారెడ్డి, కిరణ్ వచ్చారు అన్న అమ్మ కేకతో ఉలిక్కిపడి లేచాడు. టైమ్ 8.30 అయిపోయింది. ఇంతసేపు ఎలా నిద్రపోయాను అనుకొంటూ, కళ్ళు నలుపుకొంటూ బయటకు వచ్చాడు. ఏరా ఎప్పుడు వచ్చావు? కనీసం మాకు ఒకమాట చెప్పొచ్చు కదా, అమ్మ చెబితే తెలిసింది. ముఖం కడుక్కొని త్వరగా రా చెరువు దగ్గరకెళ్దాం అన్న వాళ్ళ మాట కాదనలేక గబగబా ముఖం కడుక్కొని, అమ్మ పెట్టిన టిఫిన్ తిని బయలుదేరాడు శేఖర్. చెరువు దగ్గర చిన్ననాటి స్నేహితులు చాలామంది సెలవులకు గ్రామం చేరుకున్నవారు కలిశారు. ఈత కొడుతూ కేరింతల మధ్య సమయం తెలియలేదు. ఇంటికొచ్చేటప్పటికి మధ్యాహ్నం 12 గంటలైంది. శేఖర్‌కి అప్పుడర్థమైంది ప్రొద్దునే ప్రార్థన చేసుకోలేదని. ఏదో వెలితి తెలుస్తూనే ఉంది. సాయంకాలం చేసుకుందాంలే అనుకొని సర్దుకున్నాడు. కాని మళ్ళీ అంతే తంతు. స్నేహితులు, వాళ్ళ ఆకర్షణ, వాళ్ళ జోక్స్, వాళ్ళ కబుర్లు. నెమ్మది నెమ్మదిగా శేఖర్ వాళ్ళ ప్రవర్తనలోకి జారిపోయాడు. అమ్మాయిల గురించి మాటలు, సెక్స్, ప్రేమలు వాళ్ళ అనుభవాలు ఇలా వాళ్ళు చెప్తుంటే లోపల నుండి మనస్సాక్షి గద్దిస్తున్నా శేఖర్ వాళ్ళను విడిచిపెట్టలేకపోయాడు.

రోజులు క్షణాల్లాగా గడిచి పోతున్నాయి. ఈ ఇరవైరోజుల్లో శేఖర్ రెండుమూడుసార్లు మాత్రమే కుదురుగా కూర్చొని వాక్యం ధ్యానించాడు. పల్లెటూరి వాతావరణం, బంధువులు, సమవయస్కులైన స్నేహితులు, దేవుని నుండి శేఖర్‌ను దూరంగా తీసుకొని వెళ్ళిపోయాయి. స్నేహితులు బలవంతంగా సినిమాకు తీసుకొని వెళ్ళడం, వాళ్ళ సెల్‌ఫోన్‌లో సేవ్ చేసుకున్న బూతుబొమ్మలను చూపించడం జరిగిపోయాయి. శేఖర్‌లో దాగివున్న పాతస్వభావం జూలు విదిల్చి లేచికూర్చుంది. ప్రార్థన చేసుకుందాం అనుకున్నా ఇష్టం కలగడం లేదు. వాక్యం మీద ఇష్టం తగ్గిపోయింది. నోటి నుండి మళ్ళీ అసహ్యమైన మాటలు అప్పుడప్పుడు రావడం మొదలుపెట్టాయి.

ఒకరోజు రాత్రి అనుకోకుండా సంపూర్ణరావన్న దగ్గరనుండి శేఖర్‌కు కాల్ వచ్చింది. హలో శేఖర్ ఎలా ఉన్నావ్? డి.యల్.మూడీ పుస్తకం చదివావా? ప్రార్థన చేసుకుంటున్నావా? అన్న ప్రశ్నలకు ఏం జవాబు ఇవ్వాలో తెలియక 'చేసుకొంటున్నానన్నా' అనేశాడు. జాగ్రత్త సెలవులు ఇంకా పదిరోజులే వున్నాయి. రాగానే నాకు ఫోన్ చెయ్యి అని అన్న ఫోన్ పెట్టేశాడు. శేఖర్ కరెంట్‌షాక్ తిన్న వ్యక్తిలాగా అయిపోయాడు. ఒక్కసారి వేలడిక్టరి ఫంక్షన్‌లో విన్న మెసేజ్ చెవుల్లో గింగురు మంటుంది. ప్రార్థన లేని జీవితాలు, పరిచర్య, దేవుని పరిశుద్ధత, విద్యార్థి పరిచర్యలో తన పాత్ర ఇవన్నీ శేఖర్‌కు నిద్ర పట్టనివ్వలేదు. ఏదో భయం, దేవునికి చాలా ద్రోహం చేశానన్న భావన, అన్న వాళ్ళకు ఇచ్చిన వాగ్దానం, దేవుడు ఎంతో కృప చూపించి తన తోటి స్నేహితులకు లేని గొప్ప రక్షణ ఇచ్చి లోకంలో నుండి ప్రత్యేకించిన గొప్ప భాగ్యం.... ఇవన్నీ తనను నిలదీసి ప్రశ్నిస్తున్నట్లు ఉంది. శేఖర్ మనసులో ఎవ్వరికి చెప్పుకోలేని బాధ. దేవా! నేను నీకు పనికిరాను. నేను నాకు అప్పగించబడిన బాధ్యత విషయంలో భయంకరంగా తప్పిపోయాను. నేను ఏవిధంగా ప్రేయర్ సెక్రటరీగా ఉండగలను? ఈ నెల న్నర రోజులలో ఎవ్వరికీ సువార్త చెప్పలేకపోయాను. నా ఫ్రెండ్స్‌ని ఇన్‌ఫ్లుయన్స్ చేయకపోవడం అటుంచి వాళ్ళ ద్వారా పూర్తిగా మార్చబడ్డాను. మా ఊళ్ళో నా సాక్ష్యం సరిగా లేదు. నేనూ అందరిలాగే ప్రవర్తించాను, మాట్లాడాను. నేను పదిమంది మధ్యలోనే మిమ్మల్ని వెంబడించగలను గానీ ఒంటరిగా కాదు. నేను నాయకత్వానికి పనికిరాను, నన్ను క్షమించు నా వల్ల

కాదు అని భోరుమని ఏడవడం ప్రారంభించాడు. తన మీద తనకే నమ్మకం కోల్పోయిన శేఖర్, సంపూర్ణరావు అన్నతో జరిగిన విషయం చెప్పి తనకిచ్చిన బాధ్యత నుండి తప్పుకోవాలనుకున్నాడు.

ప్రియమైన నేస్తమా! దేవుడు మన బలహీనతలను ఎరిగినవాడు, అర్థం చేసుకొనేవాడు. సాధారణంగా యౌవనదశలో ఉన్నవారు వెనుకంజ వేయడానికి, లోకం వైపు ఆకర్షించబడడానికి ఎంతో ఎక్కువ ఆస్కారం ఉంది. యవనులను ఎక్కువ ప్రభావితం చేసేది వారి చుట్టూ ఉండే వారి సమవయస్కులైన స్నేహితులే. అందుకే వారు ఎవరితో స్నేహం చేస్తున్నారనే విషయం చాలా ప్రధానమైంది. విశ్వాసులు తోటి విశ్వాసులతో కలిగివున్న బంధాన్ని సహవాసం అని దైవగ్రంథం పిలుస్తుంది. స్నేహం కన్నా సహవాసం బలమైనది. భావోద్రేక స్థాయిలో ఒకరితో ఒకరు తమ సమస్యలను పంచుకోడానికి, కలిసి ప్రార్థించడానికి సహవాసం సహాయపడుతుంది. తోటి విశ్వాసులతో గల ఈ సహవాసం దేవునితో ఆ వ్యక్తి అనుభవించే ఏకాంత సహవాసంపై ఆధారపడి ఉంటుంది. అందుకే ఒంటరిగా ఉన్నప్పుడు విశ్వాసి దాగుచోటు ఆయనతో గడిపే సహవాసమే! సాతానుడు మన ఒంటరి తనములో మనతో అబద్ధము చెప్పి, దేవుని తోడు మనము అనుభవించకుండా చేస్తాడు. ఎవ్వరూ మనలను గమనించడం లేదు అనేది సాతాను అబద్ధము. దేవుని కళ్ళు ఎప్పుడూ మనపై ఉంటాయి. మనకు సహాయము చేయడానికి ఆయన ఎప్పుడూ సిద్ధమే. పశ్చాత్తాపముతో మన పతనాలు, పాపమును ఒప్పుకొని క్షమాపణ కోసం వేడుకొంటే పూర్వాసక్తిని, కార్యాచరణ శక్తిని అనుగ్రహిస్తాడు.

ప్రియ గ్రాడ్యుయేట్ స్నేహితుడా! నీ చేయూత అక్కర గల యవనస్తులు నీ దగ్గరే ఉన్నారు. నీవు దేవునితో సరైన సహవాసం కలిగివుంటే సంపూర్ణరావులాగా వారి గురించి ఆలోచిస్తావు, ప్రార్థిస్తావు, వారిని ఫాలోఅప్ చేస్తావు, మంచి క్రైస్తవ విద్యార్థులుగా, నాయకులుగా, దేవుని పనిని పరిశుద్ధంగా చేసే వారిగా, జీవిత సమస్యలను చక్కగా ఎదుర్కొనే వారిగా తర్ఫీదునిస్తావు. నా గొర్రెలను మేపుము, నా గొర్రెలను కాయుము, నా గొర్రెపిల్లలను కాయుము అన్న ప్రభువు కోరిక (ఆజ్ఞ)ను తేలికగా తీసుకొనవు.

**– విజె డెస్క్**

**కవిత**



# ఆత్మ విమర్శ

మాదిరిగా ఉందామనే అనుకొంటాను
గుడినుండి తిరిగొచ్చాక గుర్తే ఉండదు

మాటను అదుపులో ఉంచుదామనే
అనుకుంటాను
పదిమందిలో చేరితే ప్రవాహానికి హద్దే ఉండదు

గుప్తదానాలు చేశానని అనుకుంటాను
గుర్తింపు రావట్లేదని గొణుగుతుంటాను

పెద్దరికంతో పలకరిస్తూనే వుంటాను
మనిషి దాటాక ఇచ్చకాలాడుతూనే ఉంటాను

పెదవి అంచులనుంచి ప్రేమను ఒలకబోస్తూనే
ఉంటాను
గుండెలోతుల్లోకి గునపాలు గుచ్చుతూనే
వుంటాను

వాక్యబోధనలో కారుణ్యాన్ని కుమ్మరిస్తుంటాను
జీవనసమరంలో కాఠిన్యాన్ని
విరజిమ్ముతుంటాను

దశమభాగం వాక్యధ్యానంలో గడుపుతూనే
ఉంటాను
దశతిరిగే జాతకాలను తిరగేస్తూనే ఉంటాను

నమ్మకమైన దేవుడివని నమ్ముతూనే ఉంటాను
నిత్యమూ గాయాలను రేపుతూనే ఉంటాను

సూదంటురాయిలాగా చురకత్తిలాగా
నా చూపుడు వేలెప్పుడూ ఎదుటివారి తప్పుల
వేటలో పొద్దుపుచ్చుతుంటుంది
ఆత్మవిమర్శలో గురితప్పుతూనే ఉంటుంది.

ప్రభువా...!
నీ పోలికలో సృజించబడినవాడిని
నాలోకి చూసుకుని సరిచేసుకుని
నిన్ను వెంబడించే కృపను దయచేయి!

**– డా. జడా సుబ్బారావు,** నూజివీడు



# గెలుపే ముఖ్యమా?

2023 అక్టోబర్ 28 న ఏషియా పారాగేమ్స్ పురుషుల జావెలిన్ త్రోలో స్వర్ణ విజేత నీరజ్ యాదవ్‌కు ప్రధాని అభినందన అని వార్తల్లో వచ్చింది. 2023 నవంబర్ 18 న భారత స్టార్, పారా అథ్లెట్ నీరజ్ యాదవ్ నేషనల్ యాంటీ డోపింగ్ ఏజన్సీ (నాడా) నిర్వహించిన డోప్‌టెస్ట్‌లో పట్టుబడ్డాడని, అతనికి ఇచ్చిన స్వర్ణాన్ని వెనక్కి తీసుకోనున్నట్లు నెల తర్వాత వార్తల్లో వచ్చింది. మార్గం ఎంత చెడ్డదైనా గెలుపే ముఖ్యం అనుకొన్నాడు. తన స్వర్ణం ద్వారా దేశం మొత్తానికి పరిచయమైన ఇతను అతిదారుణంగా దేశానికి అవమానాన్ని తీసుకొచ్చాడు. బయటికి రాలేకపోయాడు. ఇంతటి అవమానానికి కారణం ఏంచేసైనా గెలవడమే ముఖ్యం అనుకొన్నాడు.

ఈ మధ్యనే విశాఖపట్నంలో ఒక ఇంటర్ విద్యార్థి పరీక్షల్లో కాపీకొడుతూ స్క్వాడ్ పట్టుకొన్నారని అవమానానికి గురై ఇంటికి వచ్చి ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు.

ఎలక్షన్ కమీషన్ వారు ఎలక్షన్ షెడ్యూల్‌ని ప్రకటించారు. అన్ని పార్టీలవారు హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు. ఎలక్షన్ అనగానే మద్యం, ధనం, బలం మనకు గుర్తుకు వస్తాయి. అబద్ధాలతో కూడిన వాగ్దానాలు, మత రాజకీయాలు ఇలా...ఎన్నో ఎన్నెన్నో గమనిస్తూ ఉంటాం. వారికున్న ఒకే ఒక్క గురి గెలవడమే. దానికోసం ఎంతకైనా తెగిస్తారు. బ్యాలెట్ బాక్స్‌లు, ఈవియంలు మార్చడం, ఈవియం సాఫ్ట్‌వేర్‌లు మార్చడం లాంటివి చేయడానికి సిద్ధపడతారు. ఎందుకంటే వారికి గెలుపే ముఖ్యం.

గెలుపే ముఖ్యమా? అంటే ప్రపంచం అవుననే అంటుంది. గెలుపు కోసం ఎంతకైనా తెగించడానికి, ఎలాంటి అడ్డదారులు తొక్కడానికైనా ఇష్టపడుతున్నారు. నేటి విశ్వాసులు కూడా గెలుపు కోసం సరైన మార్గంతో సంబంధం లేకుండా, అది చెడ్డైనా, తప్పయినా, పాపం అయినా, దేవునిని దు:ఖపెట్టేదైనా అనుకొన్నది సాధించడానికి, గెలవడానికి ఇష్టపడుతున్నారు. గెలుపు ముఖ్యమే గానీ దేవుని నామానికి అవమానం తెచ్చే మార్గాల ద్వారా గెలుపుకన్నా ఓటమే మంచిది.

ఈ విధానాల్ని మనం దేవుని కోణం నుండి ఆలోచించాలి. ఎందుకంటే మనకు కొలబద్ద దేవుని వాక్యమే. మనం దేవుని బిడ్డలం. ఆయన రక్తంలో కడగబడి విమోచించబడిన వారం. మనం మన సొత్తుకాదు విలువబెట్టి కొనబడినవారం. అయినా చాలాసార్లు లోకంలోని ఆశలను అనుసరించడానికి చాలా అవకాశాలు మన ముందు ఉంటున్నాయి. "నాయొద్ద నివసించునట్లు దేశములో నమ్మకస్థులైన వారిని నేను కనిపెట్టుచున్నాను నిర్దోషమార్గమందు నడచువారు నాకు పరిచారకులగుదురు" (కీర్తన 101:6)

## విశ్వాసులు కూడా గెలుపే ముఖ్యం అని అను కోవడానికి కారణాలు, చేసే పనులు ఏంటి?

- ❖ లోక మాయలో పడి లోకంలో వారిని అను సరించడం.
- ❖ దేవుని వాక్యాన్ని సరిగా ధ్యానించి అర్థం చేసుకోకపోవడం.
- ❖ దేవుని ఉద్దేశాల్ని మన జీవితంలో అర్థం చేసుకోకపోవడం.
- ❖ దుర్బుద్ధి కలిగి ఉండడం.
- ❖ వేషధారణ జీవితం కలిగి ఉండడం.
- ❖ దేవునిమీద ఆధారపడలేకపోవడం.
- ❖ కష్టపడకపోవడం, సులభమైన దారులు ఎంచుకోవడం.
- ❖ పరీక్షల్లో కాపీ కొట్టి అయినా విజయం సాధించాలనుకోవడం.
- ❖ వేరే వారు రాసిన థీసిస్‌లు వారు రాసినట్లు చూపించడం.
- ❖ లంచాలు ఇవ్వడం.

గెలవాలనుకోవడం, విజయం సాధించాల నుకోవడం మంచిదే కానీ ఎలాంటి తప్పుడు పనైనా చేసి గెలవాలనుకోవడం తప్పు. దేవునికి వ్యతిరేఖమైన పద్ధతిలో, పరిశుద్ధాత్ముని దు:ఖపెట్టి గెలవాలనుకోవడం మన ఆత్మీయ జీవితానికి మంచిది కాదు.

## పరిచర్యలో, కమిటీస్‌లో...

గ్రాడ్యుయేట్స్‌గా, విద్యార్థులుగా కమిటీస్‌లో లేదా ఇతర సంభాషణలలో నా మాటే నెగ్గాలి, నేను చెప్పిందే జరగాలని అనుకోకూడదు. అలాంటప్పుడు అహం, భావోద్రేకాలు పని చేస్తాయి. ఎదుటివారు చెప్పినది మంచిదైనా దానిని అంగీకరించడానికి ఇష్టపడం. మనం గెలిచినప్పటికీ దేవుని నామానికి మహిమరాదు. అందుకే సామె 3:5-7లో “నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణహృదయముతో యెహోవాయందు నమ్మక ముంచుము, నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము అప్పుడు ఆయన నీ త్రోవలను సరాళము చేయును. నేను జ్ఞానిని గదా అని నీవనుకొనవద్దు యెహోవాయందు భయభక్తులుగలిగి చెడుతనము విడిచిపెట్టుము”. అని దేవుని వాక్యం చెబుతుంది.

## పర్యవసానాలేంటి?

- ❖ మన సాక్ష్యాన్ని పోగొట్టుకుంటాము.
- ❖ శోధనకు లొంగిపోయి పాపం చేస్తాము.
- ❖ దేవుని నామ మహిమార్థమై కష్టపడకుండా, సుల భమైన తప్పుడు మార్గాలు ఎంచుకొంటాము.
- ❖ ఇతరులకు తోటి స్నేహితులకు ధైర్యంగా దేవునిని గూర్చి చెప్పలేము.
- ❖ అపరాధ భావనకు గురై క్రమక్రమంగా సహవాసానికి దూరమై లోకంలో కలిసి పోతాము.
- ❖ మన చదువు, కెరీర్ జీవితం ద్వారా దేవుని నామానికి అవమానం తెస్తాం.

## యధార్థత ముఖ్యం

క్లాస్‌రూమ్‌లో నీతోటి స్నేహితులు కాపీలు రాసి లేదా చూసిరాసి నీకంటే ఎక్కువ మార్కులు తెచ్చుకోవచ్చు. లోకం అలాంటి వారిని ఎక్కువగా గౌరవించి సన్మానిస్తుంది. ఎందుకంటే, వారు చూసేది మార్కులనే. కానీ నీకు తక్కువ మార్కులు రావచ్చు. నీకు కాపీలు రాయడానికి అవకాశం ఉన్నా నీవు దేవునిని బట్టి రాయవు. కొన్ని సార్లు ఫెయిల్ కూడా అవ్వొచ్చు. దేవుడు నీ హృదయాన్ని, నమ్మకత్వాన్ని, యధార్థతను చూస్తాడు. వంచకుడై ధనము సంపాదించినవానికంటె యథార్థముగా ప్రవర్తించు దరిద్రుడు వాసి (సామె 28:6).

## యోసేపు మాదిరి

యోసేపు తన గృహంలో, తండ్రి దగ్గర, అన్నల దగ్గర, పరాయి దేశంలో యధార్థంగా ఉన్నాడు. గనుక యెహోవా యోసేపుకు తోడైయున్నాడని, అతడు వర్ధి ల్లాడని చెబుతుంది. పరాయి దేశంలో ఉన్నా ప్రభువుకి నమ్మకంగా ఉన్నాడు. పాపం చేయడానికి అవకాశం వచ్చినప్పటికీ “నేనెట్లు ఇంత ఘోరమైన దుష్కార్యము చేసి దేవునికి విరోధముగా పాపము కట్టుకొందునని తన యజమానుని భార్యతో అనెను” (ఆది 39:9). పాపం నుండి దూరంగా పారిపోయాడు. తర్వాత అతనిని పట్టుకొని రాజు ఖైదీలు బంధింపబడు చెరసాలలో వేయించెను (ఆది 39:20). యోసేపు అక్కడ కూడా దేవునికి వ్యతిరేకంగా ప్రవర్తించలేదు. చూడడానికి ఓడిపోయిన వాడిలా కన్పిస్తాడు. అయితే,

యెహోవా యోసేపుకుతోడై యుండి అతనిమీద కనికరపడి చెరసాల అధిపతికి అతని పట్ల కటాక్షము కలుగునట్లు చేశాడు. ఇయు విద్యార్థులంగా మనం ఒక్క విషయం నేర్చుకోవాలి. ఎక్కడ ఉన్నా, మనుష్యులకు కనిపించకపోయినా దేవుడు నన్ను చూస్తున్నాడు అని గుర్తెరిగి యోసేపువలె దేవుని నామానికి మహిమతెద్దాం.

### దానియేలు, షద్రక్, మేషక్, అబెద్నెగోల మాదిరి



దానియేలు, షద్రక్, మేషక్, అబెద్నెగోలు రాజు భుజించు భోజనమును పానము చేయు ద్రాక్షారసమును పుచ్చుకొని తన్ను అపవిత్ర పరచుకొనకూడదని దానియేలు ఉద్దేశించి, తాను అపవిత్రుడు కాకుండునట్లు వాటిని పుచ్చుకొనకుండా సెలవిమ్మని నంపుసకుల యధిపతిని వేడుకొన్నాడు (దాని 1:8) వారికి ఏది చేయడానికైనా అవకాశమున్నా ప్రభువు కోసం యథార్థంగా ఉన్నారు. ఆహారమే ముఖ్యం, సౌందర్యమే ముఖ్యం, గెలుపే ముఖ్యం అనుకోలేదు. మేము చేసే పని దేవుని దృష్టికి అనుకూలమైనదా కాదా అని ఆలోచించుకొన్నారు కాబట్టి దేవుడు వారికి జ్ఞానమును సకల శాస్త్ర ప్రవీణతయు వివేచనయు అనుగ్రహించాడు (దాని 1:17). పరాయి దేశంలో ప్రాణాన్ని లెక్కచేయకుండా దేవుని కొరకు నమ్మకంగా ఉండడానికి ఇష్టపడ్డారు కాబట్టి వారిని అగ్ని కాల్చలేకపోయింది, సింహాలు ఏమీ చేయలేక పోయాయి. వారు ఆ సంస్థానంలో హెచ్చింపబడ్డారు. దానియేలు, షద్రక్, మేషక్, అబెద్నెగోల దేవుడే నిజమైన దేవుడని ఆయన నామం హెచ్చింపబడడానికి కారకులయ్యారు.

### యేసయ్య మాదిరి

మూడు మేకుల మధ్య యేసయ్య ఓడినవానివలె కన్పించాడు. ఆయన ముఖము మీద ముసుగు వేశారు. పిడిగుద్దులు గుద్దారు. నిన్ను కొట్టినవారు ఎవరో చెప్పమని హేళన చేశారు. అయినా ఆయన మౌనంగా ఉన్నాడు. వేలాడదీయబడిన నేరస్తులలో ఒకడు ఆయనను దూషిస్తూ 'నీవు క్రీస్తువు గదా? నిన్ను నీవు రక్షించుకొని, మమ్మును కూడా రక్షించమని చెప్పాడు. యేసయ్య అవమానాన్ని, నిందను, హేళనను, శ్రమను భరించి తండ్రి అప్పగించిన బాధ్యతను, తండ్రికిష్టమైన రీతిలో ముగించి సమాప్తమైనదని చెప్పాడు. తండ్రీ నీ చిత్తమైతే ఈ గిన్నె నాయొద్ద నుండి తొలగించమని అడిగిన ఆయన సులువైన పద్ధతులు చూసుకోకుండా తండ్రి చిత్తాన్ని సంపూర్ణంగా నెరవేర్చాడు. సిలువలో ఓడిపోయినవానివలె కన్పించినా, సమాధిని, మరణాన్ని జయించి లోకానికి రక్షణ మార్గాన్ని చూపించాడు.

### సోమరితనం వద్దు

దేవుని వాక్యంలో సోమరులను చీమల ద్వారా హెచ్చరిస్తున్నాడు. సోమరికి వచ్చే ఫలం దారిద్ర్యం (సామె 6:11; 10:4), వెట్టి పనులు చేస్తాడు (సామె 12:24), వేటాడినా పట్టుకోలేడు (సామె 12:27) ఆశ పడతాడు కానీ ఏమీ దొరకదు (సామె 13:4), సోమరి చేతులు పనిచేయనొల్లవు, వాని ఇచ్ఛ వానిని చంపును (సామె 21:25), నిద్రమత్తు చింపిగుడ్డలు ధరించుకొనుటకు కారణమవును (సామె 23:21), సోమరి మార్గము ముళ్ళకంచె (సామె 15:19), గాఢ నిద్ర కలుగజేస్తుంది, పస్తులుంటాడు (సామె 19:15). జీవితంలో ఓటమికి మిత్రుడు సోమరే. గనుక సోమరితనాన్ని వీడదాం.

### కష్టపడదాం

బుద్ధి కలిగి కష్టపడి శ్రద్ధగా పని చేయడం వలన వచ్చే ఫలితాలు - వేసవికాలమందు ఆహారం సిద్ధపరచుకొంటాడు. కోత కాలమందు ధాన్యం కూర్చుకొంటాడు, ఐశ్వర్యవంతుడవుతాడు, ఏలుబడి చేస్తాడు, చురుకుగా ఉంటాడు, రాజులయెదుట నిలుస్తాడు, శ్రేష్టునిగా ఉంటాడు, దేవుని నామానికి మహిమ తెస్తాడు.

### ముగింపు

గెలుపే ముఖ్యమని దేవునికి అవమానం తెచ్చే మార్గాలగుండా వెళ్ళకుండా, ప్రభువుకోసం యథార్థంగా, నిజాయితీగా, నమ్మకంగా, ఓడినా గెలిచినా ప్రభువు మహిమార్థం బ్రతుకుదాం. మీరు లోకానికి ఉప్పై ఉన్నారు, వెలుగై ఉన్నారు అనే ప్రభువు మాటల్ని జ్ఞాపకం చేసుకొందాం. చీకటి లోకంలో ఉన్న లోకానికి జ్యోతులవలె మార్గాన్ని చూపుదాం. యథార్థంగా ప్రవర్తించువారు ఆయనకిష్టులు (సామె 11:20). కాబట్టి యథార్థంగా ప్రవర్తించుదాం.

– డా. యం. సాల్మన్ రాజు, వైజాగ్



# చింతించడం

## అల్ప విశ్వాసి లక్షణం

ఆందోళన అనేది మన తరంలో ఒక మానసిక మహమ్మారి. చింత అంటే మనసులో అశాంతి, విచారం, వేదన, వ్యాకులం. దేనికోసమో ఆరాటంగా, ఆత్రుతగా అనిపించడం. "వర్రీ"(చింతించటం) అనే ఆంగ్ల పదానికి అర్థం "గొంతు నొక్కడం". "చింత తరచుగా చిన్న విషయానికి పెద్ద నీడను ఇస్తుంది" అని స్వీడిష్ సామెత చెబుతుంది.

చింతలకు అసలు కారణం పాపమని, మానవ పాపము మనిషిని భయాందోళనలతో నింపి నెమ్మది లేకుండా చేస్తుందని బైబిల్ బోధిస్తుంది. చింతించడానికి విశ్వాసులు కూడా అతీతులు కారు. పైపెచ్చు ఇంకా ఎక్కువ సమయం చింతిస్తూ నిరాశ నిస్పృహలతో సతమతమవుతూ ఉంటారు. "దేవునికి, దేవుని చిత్తానికి వ్యతిరేకంగా ఉన్న వాటిపై మన ఆశలు కేంద్రీకృతమై ఉన్నప్పుడు ఆందోళన సహజ ఫలితం" అని బిల్లీ గ్రాహం అంటారు.

చింత మనశ్శాంతిని, ఆనందాన్ని హరించి వేస్తూ భయాందోళనతో ఊపిరాడకుండా చేస్తుంది. చింత మనల్ని మానసికంగా, భావోద్రేకంగా, ఆధ్యాత్మికంగా, శారీరకంగా ప్రభావితం చేస్తుంది. "ఆందోళన రక్త ప్రసరణ, గుండె, గ్రంథులు, మొత్తం నాడీ వ్యవస్థను ప్రభావితం చేసి ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది" అని డాక్టర్ ఛార్లెస్ మాయో చెప్పాడు. అనేక ఆందోళన రుగ్మతలు, క్యాన్సర్‌కు కూడా కారణమవుతాయి. చింత మనిషి సామర్థ్యాన్ని దెబ్బతీసి అచేతనంగా చేస్తుంది. జీవించాలనే ఆశను చంపి, నిరాశతో నింపి జీవశ్ఛవాలుగా చేసి చంపుతుంది.

మానవులందరూ చీకు, చింత లేని ఆనందమయ జీవితాన్ని కోరుకొంటారు. చింత నుంచి బయట పడాలని, అసలు చింత దరి చేరకుండా ఉండాలని శత విధాలా ప్రయత్నిస్తారు. కొంతమంది మోటివేషనల్ స్పీకర్స్ అయితే, "చింతలేని జీవితం కావాలా? చింతను ఎదుర్కొనే చిట్కాలు చెబుతూ, డోంట్ వర్రీ" అని అంటారే గాని వర్రీని తొలగించలేరు.

యేసుక్రీస్తు కొండమీది ప్రసంగంలో చింత, ఆందోళన ఒక సాధారణ సమస్యగా గుర్తించి దేవుని బిడ్డలు/శిష్యులు చింతను అధిగమించగల బోధను చేశారు. మత్తయి 6:25-34 వాక్య భాగంలో మూడుసార్లు, "చింతించవద్దు" అని ఆజ్ఞాపిస్తూ ఎందుకు చింతించకూడదో కారణాలు చెప్పారు. మొదటిది, ఆందోళన వల్ల ఎలాంటి ఉపయోగం లేదు (వ 27). రెండవది, ఆందోళన విశ్వాసులను అవిశ్వాసుల్లాగా ప్రవర్తించేలా చేస్తుంది (వ 30). మూడవది, విశ్వాసులను పోషించి అవసరాలు తెలిసి తీర్చే పరమ తండ్రి ఉన్నాడు (వ 32,33). నాలుగవది, ఆందోళన చెందడం, మనల్ని మనం హైరానా పెట్టుకోవడం దేవునిని అగౌరవపరచడమే తప్ప వేరొకటి కాదు. "నా పరమ తండ్రి నా గురించి శ్రద్ధ తీసుకొనే సామర్థ్యం లేనివాడు లేదా ఆయనకు అది ఇష్టం లేదు" అని అనుకోవడంతో సమానం.

మనం సాధారణంగా చింతను విశ్వాసలేమిగా భావించం. చింతించే వ్యక్తిని యేసు, "ఓ అల్ప విశ్వాసి" అన్నాడు. అల్ప విశ్వాసం అంటే విశ్వాసం బొత్తిగా లేకపోవడం కాదు. కొందరికి పాపక్షమాపణ, శాశ్వత జీవం పొందగలిగే నమ్మకం ఉంటుంది గానీ తమ ఆందోళనలను, భయాలను జయించే నమ్మకం ఉండదు. దేవుడంటే నమ్మకం లేనివారు ఏమి తిందుమో, యేమి తాగుదుమో, యేమి ధరించు కొందుమో అని విచారిస్తారు. విశ్వాసులు దీనికి భిన్నంగా ఉండాలని దేవుడు కోరుతున్నాడు. వారు నమ్మకమైన, ఆనందమైన ప్రత్యేక ప్రజగా, ఆధ్యాత్మిక విషయాలను అనుసరిస్తూ ఉండాలని కోరుతున్నాడు. ఎందుకంటే మనము దేవునికి విలువైన వారము, శ్రేష్టులము. కాబట్టి చింతించడమంటే దేవుని మాటను, మార్గాన్ని విస్మరించడం. అవిధేయత కూడా.

మన చింత యావత్తు ఆయనమీద వేయాలి ఎందుకంటే ఆయన మన గూర్చి చింతించుచున్నాడు (1పేతురు 5:7; కీర్తన 55:22). చింత ఉండదని దేవుడు చెప్పడం లేదు. కష్టాలు, బాధలు కలుగుతాయి. అయితే, రేపటి గూర్చి చింతించకుండా, ఏ రోజుకా రోజు దేవునిపై నమ్మకంతో జీవించాలని, ప్రార్థించాలని, దేవుని వాక్యాన్ని ధ్యానించాలని మాత్రం చెబుతున్నాడు. చింతలేదిక యేసు చెంతనుండగ అంటూ ప్రతిరోజూ మన ఆందోళనను ఆరాధనతో రీప్లేస్ చేయాలి.

– డా.జె. రత్న గ్రేస్, వైజాగ్

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**

**Date of Printing: 25-03-2024**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

# నేనే



సొంత ప్రపంచాన్ని
చుట్టూ కప్పేసుకుని
తూర్పు నుంచి
పడమర దాకా
నేనే!

మనసు మేఘాల్లో
ఆలోచనల పొద్దు
పొడిచినప్పటి నుంచి
నిద్దుర కొండల్లోకి
అస్తమించే వరకు
వెలగాల్సింది
నేనే!

పెదవులు పోగయ్యే
ప్రతి సభలో
రహస్య ఎజెండా
నేనే!

సముద్రమంత స్వార్థం
పొగడ్తల నదులన్నీ
కలవాల్సింది
నాలోనే
గుర్తింపుకు
బీటలు పడ్డాయా
సునామీలే

నా భుజాల మీద
నన్ను మోసుకుంటూ
బజారులన్నీ తిరుగుతాను

ప్రతి అద్దంలో
నా బొమ్మే కనబడాలని
మోచేతుల సాయంతో
మిగతా వారిని
పక్కకు నెడతాను

ప్రాణనాడుల నిండా
పేరుకు పోయిన అహం
పక్కవాడిలోకి ప్రేమ
ప్రవహించేదెలా?

గుండె మధ్యలో నాటుకున్న
నేను అనే కొయ్యకు
నన్ను కట్టేసుకుని
నా చుట్టూ నేను
తిరిగీ తిరిగీ
అలసి పోయాను

నాలో నేను
చిక్కుకున్నాను
నా కాళ్ళకింద పడి
నలిగి పోయాను
విడిపించవా ప్రభూ
నన్ను
నా నుంచి

– డా. తాళ్ళూరి ప్రసాద్

UESI PUBLICATIONS Since 1988

**UESI PUBLICATION TRUST - ANDHRA PRADESH BRANCH**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508